సంపుటి : 9
సంచిక : 306
బుధవారం
29 జూలై 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వం వాయిస్

10 YEARS CELEBRATING
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.
SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT
CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



Contact For Ads:
7579339999

## అమరావతి అంటే ఆ 29 గ్రామాలే కాదు..

# విజయవాడ, గుంటూరుతో కలిపి చూడాలి

- రాజధాని పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- స్పీడ్, క్వాలిటీ, డెలివరీ లక్ష్యంగా పనిచేయాలని సూచన
- పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్ట్ సంస్థలకు ఆదేశం
- ఆర్థిక సమస్యలు ఉండవని, ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ
- ఇకపై క్షేత్రస్థాయిలో తానే స్వయంగా పనులను పర్యవేక్షిస్తానని వెల్లడి



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజధాని అమరావతిని కేవలం 29 గ్రామాల సముదాయంగా మాత్రమే చూడరాదని, విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుకొని ఒక బృహత్ ప్రణాళికగా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ రెండు నగరాల్లోనూ మౌలిక వసతుల ప్రాజెక్టులను రాజధానికి అనుసంధానంగా అభివృద్ధి చేసినప్పుడే సమగ్ర రాజధాని రూపుదిద్దుకుంటుందని ఆయన అన్నారు. మంగళవారం సచివాలయంలో రాజధాని నిర్మాణ పనులపై సీఆర్డీఏ అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాజధాని నిర్మాణ పనులను 'స్పీడ్, క్వాలిటీ, డెలివరీ' లక్ష్యంగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. గతంతో పోల్చితే పనుల్లో వేగం కొంత పెరిగినప్పటికీ, అది ఏమాత్రం సరిపోదని, మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం తరపున ఆర్థికంగా ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తున్నామని, కాబట్టి పనుల్లో ఎక్కడా జాప్యం జరగడానికి వీల్లేదని తేల్చిచెప్పారు. రాజధాని నిర్మాణం వంటి గొప్ప అవకాశం దక్కినందుకు కాంట్రాక్టు సంస్థలు దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజధానిలో రూ.50,999 కోట్ల విలువైన 95 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని, నెలకు కనీసం 7.92 శాతం చొప్పున పనులు పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించారు. భూసేకరణ, నిధుల సమీకరణ, అనుమతులు, డిజైన్ల వంటి కీలకమైన అంశాల్లో అన్ని ప్రభుత్వ శాఖలు, ఉన్నతాధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రోడ్ల నిర్మాణంతో పాటు పచ్చదనం పెంపుపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. రాజధాని నిర్మాణ పనుల పురోగతిని ఇకపై తాను స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, పలువురు ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

**ఎల్ నినో ఉపద్రవాన్ని అధిగమించడం ఓ సవాల్ : సీఎం చంద్రబాబు**

రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండబోతోందన్న అంచనాల నేపథ్యంలో, ఈ ఉపద్రవాన్ని అధిగమించడం అధికార యంత్రాంగానికి ఒక పెద్ద సవాల్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ కష్టకాలంలో రైతులకు అన్ని విధాలా అండగా నిలవాలని, వారికి సరైన సమాచారం అందిస్తూ నష్టపోకుండా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఎల్ నినో కార్యాచరణ ప్రణాళిక (యాక్షన్ ప్లాన్) అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని ఆయన హెచ్చరించారు. మంగళవారం సచివాలయంలో ఎల్ నినో ప్రభావం, ప్రభుత్వ చర్యలపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

**ఎల్ నినో ఉపద్రవం..**

ఈ సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ఎల్ నినో ఉపద్రవాన్ని అధికార యంత్రాంగం మొత్తం ఒక సవాల్‌గా స్వీకరించి సమష్టిగా పనిచేయాలి. మంత్రి నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ మిగతా .. 2లో..

## జనసంద్రమైన
# సింహాచలం
### వేడుకగా 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ



**సింహాచలం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి గిరి ప్రదక్షిణ మహోత్సవం అంగ రంగ వైభవంగా కొనసాగుతోంది. సింహాద్రి అప్పన్న నామస్మరణతో గిరి ప్రదక్షిణ మార్గం మార్మోగిపోతోంది. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే ఈ మహోత్సవంలో పాల్గొనేందుకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో 32 కిలోమీటర్ల మార్గమంతా కిటకిటలాడుతోంది. కొండ దిగువన ఉన్న తొలిపావంచ వద్ద కొబ్బరి కాయలు కొట్టి, మిగతా .. 2లో..

## సీఎం చేతిలో బ్లాక్ మెయిలింగ్
# సాధనంగా హైడ్రా : కేటీఆర్




**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** అధికార పార్టీ నేతల అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యలు తీసుకోవడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైడ్రాపై హైకోర్టు ఆదేశాలు ప్రభుత్వానికి చెంప పెట్టు అని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు. "హైడ్రా తొమ్మిది తలల విష సర్పమని హైకోర్టు చెప్పింది. సీఎం చేతిలో హైడ్రా బ్లాక్ మెయిలింగ్ సాధనంగా మారింది. మంత్రులు పొంగులేటి, వివేక్‌తో పాటు ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఇళ్లు ఎందుకు కూల్చట్లేదు?బడా బాబులను వదిలి పేదల ఇళ్ల జోలికే ఎందుకు వెళ్తున్నారు? ఒక్క ఇల్లు కట్టకపోయినా.. వేల ఇళ్లు కూల్చి వేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక హైకోర్టు మిగతా .. 2లో..

## ఆ దారుణాలను కప్పిపుచ్చుకునేందుకే..
# పీవోకేలో ఎన్నికలపై భారత్



**విశ్వం వాయిస్ న్యూస్ :** పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో శాసనసభ ఎన్నికలు నిర్వహించడంపై భారత్ స్పందించింది. ఆ ప్రాంతంలో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలను కప్పిపుచ్చుకునేందుకు చేస్తున్న కపట ప్రయత్నాల్లో అవి భాగమని దుయ్యబట్టింది. ఈ మేరకు భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ దాయాది తీరుపై మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో శాసనసభ ఎన్నికలు జరుగుతున్నాయనే వార్తలను మనం మిగతా .. 2లో..

## పార్టీ లైన్ దాటలేదు..
# దుష్టశక్తుల వల్లే వివాదం
### టీడీపీ కమిటీ ముందు బొండా ఉమ వివరణ



**గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** గుంటూరులో జరిగిన ముద్రగడ పద్మనాభం సంస్మరణ కార్యక్రమంలో వైసీపీ నేత అంబటి రాంబాబుతో సమావేశం కావడంపై చెలరేగిన వివాదంపై తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వివరణ ఇచ్చారు. దీనిపై పార్టీ అధిష్ఠానం ఏర్పాటు చేసిన విచారణ కమిటీ ముందు మంగళవారం ఆయన హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడులతో కూడిన కమిటీకి తన వాదనను సమగ్రంగా వినిపించారు. తాను పార్టీ లైన్‌ను ఎప్పుడూ దాటలేదని, చంద్రబాబు ఆదేశాలను ధిక్కరించే ప్రసక్తే లేదని, చంద్రబాబు ఆదేశాలే తనకు శిరోధార్యమని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియాలోని కొన్ని దుష్ట శక్తులు కావాలనే తన మాటలను, అక్కడ జరిగిన సంఘటనను వక్రీకరించి దుష్ప్రచారం చేశాయని ఆయన ఆరోపించారు.

**అసలేం జరిగిందంటే..**

ఈ నెల 25వ తేదీన గుంటూరులో మిగతా .. 2లో..

# 7ఏళ్లు నివసిస్తే గ్రీన్‌కార్డ్ వచ్చేలా
### అమెరికా నేత కీలక ప్రతిపాదనలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** హెచ్-1బీ వీసా, గ్రీన్‌కార్డ్ విషయంలో రిపబ్లికన్, డెమోక్రటిక్ సభ్యులు అమెరికా కాంగ్రెస్ (పార్లమెంట్) భిన్నమైన ప్రతిపాదనలు చేస్తున్నారు. హెచ్-1బీ వీసాల జారీని మూడు సంవత్సరాల పాటు నిలిపివేయాలని ఇటీవల రిపబ్లికన్ పార్టీ సభ్యుడు టిమ్ షీహీ సెనెట్‌లో బిల్లు ప్రవేశపెట్టిన సంగతి మిగతా .. 2లో..

## భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సంపై
# మంత్రి లోకేష్ సమీక్ష



**విజయనగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆగస్టు 1న ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై మంత్రి నారా లోకేశ్ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రోడ్డు నిర్మాణ పనులు, పార్కింగ్, బస్సు రూట్లు, వేదిక కార్యక్రమాలు, పబ్లిక్ గ్యాలరీ, అత్యవసర వైద్య సదుపాయాలు, భోజన ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాలను సంబంధిత బాధ్యులు.. అంశాలపై చర్చించారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లను అధికారులు వారికి వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి నారా లోకేశ్ అధికారులకు పలు సూచనలు చేశారు. బస్సులన్నీ 9 గంటలకే పార్కింగ్ స్థలాలకు చేరుకునేలా మిగతా .. 2లో..

## ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ
# వివరణ తీసుకోండి
### సీఎం చంద్రబాబు ఆదేశం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఇటీవల జరిగిన పరిణామాలపై తెదేపా అధిష్ఠానం అసంతృప్తిగా ఉంది. అహోబిలం దేవస్థానం టెండర్ల వివాదంపై సీఎం చంద్రబాబుకు మిగతా .. 2లో..

## విద్యార్థులపై
# పోలీసుల తీరు సరికాదు
### కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో జరుగుతున్న చర్చలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనకారులపై పెల్లెట్ గన్స్ వినియోగించడాన్ని, లాఠీఛార్జి చేయడాన్ని తప్పుబట్టారు. ఆయుధాలు ప్రయోగించడానికి వారేమైనా ఉగ్రవాదులా అని ప్రశ్నించారు. విద్యార్థుల మీద పోలీసుల దౌర్జన్యంపై ప్రధాని మోదీ.. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశయువత తమ ప్రజాస్వామ్య హక్కులను శాంతియుతంగా వినియోగించుకుంటుండగా.. వారిపై దాడి చేయడం సరైన చర్య మిగతా .. 2లో..

## ముద్రగడ నా బంధువు...
# రాజకీయాల కోసం వెళ్లలేదు
### జగ్గంపేట టీడీపీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ అధినేత జగన్ వేస్తున్న రాజకీయ ట్రాప్‌లలో తమ కూటమికి చెందిన కొందరు నేతలు అనవసరంగా పడిపోతున్నారని, అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని జగ్గంపేట టీడీపీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హెచ్చరించారు. తాటిపాకలో జరిగిన ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభకు హాజరుకావడంపై వస్తున్న విమర్శలకు జ్యోతుల నెహ్రూ గట్టి కౌంటర్ ఇచ్చారు. "ముద్రగడ నాకు వరుసకు మిగతా .. 2లో..

# చర్చకు నేనొస్తా...
### మంత్రి నారా లోకేష్‌కు పేర్ని నాని బహిరంగ సవాల్




**విశ్వం వాయిస్ న్యూస్ :** డీఎస్సీ ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయంటూ మంత్రి నారా లోకేష్‌పై మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎస్సీ అవకతవకలపై బహిరంగ చర్చకు రావలసిందిగా ఆయన లోకేష్‌కు సవాల్ విసిరారు. ఒకవేళ చర్చకు ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తే వైసీపీ నుంచి జగన్ వస్తారని... లోకేశ్ వస్తే స్వయంగా తానే ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువత జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాట మాడుతోందని పేర్ని నాని ఆరోపించారు. ప్రభుత్వం మిగతా .. 2లో..

## హైదరాబాద్ పోలీసుల అదుపులో
# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి!



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళా ట్రైనీ ఐపీఎస్ పై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉమ్మడి నల్గొండ జిల్లా మిర్యాలగూడ సమీపంలో ఆయన్ను గుర్తించిన పోలీసులు, అనంతరం హైదరాబాద్‌లోని అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హైదరాబాద్ శివరాంపల్లిలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ట్రైనీ ఐపీఎస్ మిగతా .. 2లో..




# ఇకపై ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు
### తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇకపై ఏటా చెల్లిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. భవిష్యత్తులో ఈ బకాయిల సమస్య ఉండదన్నారు. ఢిల్లీలో మీడియాతో సీఎం మాట్లాడారు. "ఫీజు రీయింబర్స్‌మెంట్ కొట్టేయాలని చూసిన సంస్థలపై విచారణ జరుగుతోంది. బీఆర్ఎస్ హయాంలో బకాయిలు పెట్టిన రీయింబర్స్‌మెంట్ రూ.8వేల కోట్లు భారంగా మారింది. వాటిని మేం ఇవ్వట్లేదనే భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ అంశంపై మిగతా .. 2లో..

# బ్యాంకాక్‌లో దారుణం..
### భారత టూరిస్టులను కిడ్నాప్ చేసి.. చిత్ర హింసలు పెట్టి..



**విశ్వం వాయిస్ న్యూస్ :** థాయ్‌లాండ్‌లో ఓ దారుణం వెలుగు చూసింది. భారత్ నుంచి వెళ్లిన ముగ్గురు పర్యాటకులకు చౌక ధరలో బస కల్పిస్తామని నమ్మించిన ఓ ముఠా, వారిని నిర్బంధించి రూ.లక్షల్లో డబ్బులు డిమాండ్ చేసింది. చేతులు, కాళ్లు కట్టేయడంతోపాటు చిత్ర హింసలకు గురిచేసింది. సమాచారం అందుకున్న థాయ్‌లాండ్ పోలీసులు.. బాధితులను రక్షించారని స్థానిక మీడియా వెల్లడించింది. అక్కడి మీడియాకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భారత్‌కు చెందిన మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## విజయవాడ, గుంటూరుతో కలిపి చూడాలి

బాధ్యతగా వ్యవహరించాలి. వరదలు, తుపానుల సమయంలో ఎలాగైతే అప్రమత్తంగా ఉంటామో, అదే రీతిలో ఇప్పుడు కూడా పనిచేయాలి" అని స్పష్టం చేశారు. మార్కెట్ కమిటీలు, నీటి సంఘాల సభ్యులను ఈ అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని సూచించారు. వాతావరణ పరిస్థితులు, పంటల అధ్యయనం కోసం వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థుల సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల (ఆర్ఎస్కే) స్థాయిలో ఇంప్లిమెంటేషన్ కమిటీలు ఏర్పాటు చేసి, సిబ్బందిని కన్వీనర్లుగా నియమించాలని ఆదేశించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో డెయిరీ, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, దీనివల్ల రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయం లభిస్తుందని సీఎం సూచించారు.

**ప్రతి పంటకు బీమా.. కలెక్టర్లదే బాధ్యత**

రైతులను ఆదుకునేందుకు పంటల బీమా కీలకమని చంద్రబాబు అన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాల కింద నమోదు ప్రక్రియ జూలై 31తో ముగియనుండగా, వరికి ఆగస్టు 15 వరకు గడువు ఉందని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 6.30 లక్షల హెక్టార్లలో పంటలు బీమా పరిధిలోకి వచ్చాయని వివరించారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. "రాష్ట్రంలో సాగైన ప్రతి పంటకు కచ్చితంగా బీమా చేయించాలి. ఒక్క పంట నమోదు కాకపోయినా దానికి సంబంధిత జిల్లా కలెక్టర్లే పూర్తి బాధ్యత వహించాలి" అని తీవ్రంగా హెచ్చరించారు. అదేవిధంగా, రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పశుగ్రాసం కొరత లేకుండా చూడాలన్నారు.

**పర్యవేక్షణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్**

ఎల్ నినో ప్రభావాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు రాష్ట్రస్థాయిలో ఒక ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. "ఈ కంట్రోల్ రూమ్ ద్వారా వచ్చే డేటాను నిరంతరం విశ్లేషించాలి. ఆ విశ్లేషణల ఆధారంగా రైతులకు అవసరమైన సూచనలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించాలి. ఏ ల్యాండ్ పార్శిల్‌లో పంటకు ఇబ్బంది ఉంది, అక్కడ బోరుబావి అందుబాటులో ఉందా, భూగర్భ జలాల పరిస్థితి ఏంటి అనే వివరాలతో రైతులకు సరైన మార్గనిర్దేశం చేయాలి" అని సీఎం అన్నారు. దీనివల్ల రైతులు అనవసరంగా పెట్టుబడి పెట్టి నష్టపోకుండా ఉంటారని ఆయన అభిప్రాయపడ్డారు.

**క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన.. ప్రత్యామ్నాయ పంటలు**

ఆగస్టు 3 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎల్ నినోపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వరికి బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలైన కంది, ఆముదం, మినుము వంటి వాటిపై దృష్టి సారించేలా రైతులను ప్రోత్సహించాలని చెప్పారు. అత్యవసర విత్తన ప్రణాళికను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎల్ నినో కారణంగా నిత్యావసరాలు, కూరగాయల ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ప్రతి జిల్లాలో ఒకటి చొప్పున మొబైల్ రైతు బజార్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మొబైల్ వాహనాలను రైతులు లేదా డ్వాక్రా మహిళలకు అప్పగించాలని సీఎం తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## జనసంద్రమైన సింహాచలం

ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు పాదయాత్రను ప్రారంభించారు. ఈ ఏడాది 10 లక్షల మందికి పైగా భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, దేవస్థానం అధికారులు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేశారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను డ్రోన్ల సహాయంతో పర్యవేక్షిస్తూ, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పాదయాత్ర చేస్తున్న భక్తుల కోసం గిరి ప్రదక్షిణ మార్గంలో 33 చోట్ల వైద్య శిబిరాలు, 26 అంబులెన్స్‌లను అత్యవసర సేవల కోసం సిద్ధంగా ఉంచారు. గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న వారికి అప్పన్న ఉచిత దర్శన సౌకర్యం కల్పించారు. మార్గమధ్యంలో పలు స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు భక్తులకు అల్పాహారం, తాగునీరు అందిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. 32 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేసుకుని భక్తులు బుధవారం ఉదయానికి స్వామివారి ఆలయానికి చేరుకుంటారు. ఆషాఢ పౌర్ణమి నాడు సింహాద్రి కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణ చేసినంత పుణ్యఫలం దక్కుతుందని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు.

## సాధనంగా హైడ్రా : కేటీఆర్

సూచనలతో హైడ్రాను రద్దు చేసి బంగాళాఖాతంలో విసిరేస్తాం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

**కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కేటీఆర్ భేటీ**

అంతకుముందు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కేటీఆర్ భేటీ అయ్యారు. రాష్ట్రానికి చెందిన పలు రైల్వే సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మనోహరాబాద్-సిద్దిపేట-సిరిసిల్ల-వేములవాడ-కొత్తపల్లి రైల్వే లైన్‌ను మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలని కోరారు. సిరిసిల్ల నియోజకవర్గానికి అత్యంత కీలకమైన 151 కి.మీ మనోహరాబాద్-సిద్దిపేట-సిరిసిల్ల-వేములవాడ-కొత్తపల్లి న్యూ బ్రాడ్ గేజ్ రైల్వే ప్రాజెక్టును అత్యవసరంగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగిందని, అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిలిచిపోయిందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టు మళ్లీ పట్టాలెక్కిందని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

## పివోకేలో ఎన్నికలపై భారత్

చూశాం. వారి ఆక్రమణలో ఉన్న ప్రాంతాలు ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే. అక్కడ జరుగుతున్న ఎన్నికల తతంగం అనేది వారి ఆక్రమణలను కప్పిపుచ్చుకోవడం, తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘనల వంటి దారుణాలను బయటి ప్రపంచానికి తెలియకుండా చేసే ప్రయత్నమే. ఆర్థిక దోపిడీ, ప్రాథమిక హక్కులను హరించడం, అణచివేత వంటి పర్యవసానాల ఫలితమే ఇటీవల అక్కడ వెల్లువెత్తిన ఆందోళనలు" అని రణ్‌ధీర్ జయస్వాల్ పేర్కొన్నారు.

**రిగ్గింగ్ ఆరోపణలు..**

మరోవైపు, పీవోకేలో 45 అసెంబ్లీ స్థానాలకు మూడు దశల్లో పాక్ ఎన్నికలు నిర్వహిస్తోంది. జులై 27న తొలి విడతలో భాగంగా 13 స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. పాకిస్థాన్ ముస్లిం లీగ్-నవాజ్ తొమ్మిది చోట్ల విజయం సాధించగా మరో నాలుగు చోట్ల పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ గెలుపొందినట్లు అక్కడి ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పీటీఐ మాత్రం ఈ ఎన్నికలకు దూరంగా ఉంది. అయితే, తొలి దశలో పోలింగ్‌లో భారీస్థాయిలో రిగ్గింగ్ జరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి.

## దుష్టశక్తుల వల్లే వివాదం

దివంగత నేత ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభ జరిగిందని, ఆ కార్యక్రమానికి కాపు జేఏసీ ఆహ్వానం మేరకు తాను వెళ్లానని బోండా ఉమా తెలిపారు. "అది పూర్తిగా రాజకీయాలకు అతీతమైన సంస్మరణ సభ. నేను ఉదయం 11 గంటలకు వెళ్లి, అక్కడ నివాళులు అర్పించి గంటలోపే, అంటే 12 గంటలకు తిరిగి వచ్చేశాను. నేను కూర్చున్న చోటుకే వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు వచ్చారు. ఆయన పలకరిస్తే నేను మాట్లాడాను. ఇది రహస్యంగానో, చాటుమాటుగానో జరిగింది కాదు. మీడియా అంతా అక్కడే ఉంది. బహిరంగ వేదికపైనే ఈ సంభాషణ జరిగింది. ఆ సభకు జనసేన, బీజేపీ, టీడీపీ, వైసీపీ సహా అన్ని పార్టీల నాయకులు హాజరయ్యారు" అని ఉమా వివరించారు.

**దుష్ట శక్తుల వక్రీకరణ వల్లే వివాదం**

ఒక చిన్న విషయాన్ని పట్టుకుని, దానిని వక్రీకరించి సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ చేశారని బోండా ఉమా ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ వివాదం వెనుక కొన్ని దుష్ట శక్తులు ఉన్నాయి. పార్టీలో గ్యాప్ తేవాలనుకునే వారు ఇలాంటి ప్రచారాలు చేస్తుంటారు. నేను అనని మాటలను కూడా అన్నట్లుగా కొన్ని టీవీ ఛానెళ్లలో ప్రసారం చేశారు. నేను ఆరోజు ఉదయం 12 గంటలకు గుంటూరు నుంచి వచ్చేస్తే, ఆ తర్వాత రోజంతా నా పేరుతో స్టేట్‌మెంట్లు ఎలా వచ్చాయి? ఇదంతా నాపై, పార్టీపై జరుగుతున్న కుట్రలో భాగమే" అని ఆయన ఆరోపించారు.

**పార్టీకి, చంద్రబాబుకు ఎప్పుడూ విధేయుడినే**

తాను 25 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో ఉన్నానని, ఏనాడూ పార్టీ గీత దాటలేదని బోండా ఉమా ఉద్ఘాటించారు. "2019 నుంచి 2024 మధ్య కాలంలో ప్రాణాలకు తెగించి పార్టీ కోసం పనిచేశాం. మాచర్ల, గుడివాడ ఘటనలైనా, టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి జరిగినా పార్టీని కాపాడుకోవడానికి ముందున్నాం. చంద్రబాబు ఆదేశాలను, ఆయన ఉద్దేశాలను ధిక్కరించే ఆలోచన నాకు కలలో కూడా రాదు, రాబోదు. ఈ విషయంపైనే కమిటీకి సమగ్రంగా వివరించాను" అని ఆయన తెలిపారు. జరిగిన సంఘటన వల్ల పార్టీకి ఏదైనా నష్టం వాటిల్లిందా అనే కోణంలో అధిష్ఠానం వివరణ కోరిందని, వాస్తవాలను వారికి తెలియజేశానని చెప్పారు. ఇది కేవలం సమన్వయ లోపం వల్లే జరిగిందని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకుంటానని కమిటీకి హామీ ఇచ్చినట్లు బోండా ఉమా స్పష్టం చేశారు. దీంతో ఈ వివాదానికి తెరపడినట్లయింది.

## 7ఏళ్లు నివసిస్తే గ్రీన్‌కార్డ్ వచ్చేలా

తెలిసిందే. తాజాగా డెమోక్రటిక్ సెనెటర్ అలెక్స్ పాడిల్లా భిన్నమైన ప్రతిపాదనలు చేశారు. హెచ్-1బీ వీసాదారులు సహా అమెరికాలో 7 ఏళ్లుగా నివాసం ఉంటున్నవారు అక్కడ గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేసుకొనేలా వీలు కల్పించాలని ఆయన సూచిస్తున్నారు. పాడిల్లా గత సంవత్సరం 'ఇమిగ్రేషన్ యాక్ట్ ఆఫ్ 1929లో వలస నిబంధనల పునరుద్ధరణ' బిల్లును తీసుకువచ్చారు. వలసదారులే లక్ష్యంగా తీసుకువస్తోన్న కఠిన నిబంధనలకు కౌంటర్‌గా ఈ బిల్లులో పలు ప్రతిపాదనలు చేశారు. అమెరికాలో ఏడు సంవత్సరాల పాటు నివసించినవారు శాశ్వత నివాసం కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈ బిల్లు వీలుకల్పిస్తుంది. అయితే వారిపై ఎలాంటి క్రిమినల్ కేసులు ఉండకూడదు. "కష్టపడి పనిచేసే వలసదారుల పట్ల ట్రంప్ ప్రభుత్వం చూపుతోన్న కఠినవైఖరికి వ్యతిరేకంగా గతంలో ఈ బిల్లు ప్రవేశపెట్టాను. వారే లక్ష్యంగా అధ్యక్షుడు చేస్తోన్న వ్యాఖ్యలు ఇక్కడే తమ జీవితాన్ని నిర్మించుకున్న కుటుంబాలను అనిశ్చితిలోకి నెట్టేస్తున్నాయి. మన ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి దోహదం చేస్తోన్న లక్షలాది మంది దీర్ఘకాలిక నివాసితులను కాంగ్రెస్ విస్మరించకూడదు. మన వలస చట్టాలను సవరించి.. శాశ్వత నివాసం కోసం న్యాయపరమైన అవకాశాలను కల్పించడానికి ఇదే సరైన సమయం" అని పాడిల్లా పేర్కొన్నారు.

## మంత్రి లోకేష్ సమీక్ష

చూడాలన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు.. సమష్టిగా పనిచేసి ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పండగల నిర్వహించాలని మంత్రులు సూచించారు.

**ప్రధాని మోదీ పర్యటన.. ట్రాఫిక్‌పై ఎస్పీ సమీక్ష**

విజయనగరం గ్రామీణం: భోగాపురం విమానాశ్రయాన్ని ప్రధాని మోదీ ఆగస్టు 1న ప్రారంభించనున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. మంగళవారం పోలీసు ఉన్నతాధికారులతో కలసి విమానాశ్రయానికి వెళ్లే రహదారులు, పార్కింగ్ స్థలాలు, బహిరంగ సభాస్థలం, కమాండ్ కంట్రోల్, ఎయిర్ పోర్ట్ మార్గానికి అనుసంధానం చేస్తున్న ట్రంపెట్‌లను సందర్శించి, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ప్రధాని పర్యటనలో పాల్గొనేందుకు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాల నుంచి సుమారు 5వేల బస్సులు, ప్రముఖులకు సంబంధించి 5వేల కార్లు, ఇతర వాహనాలు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలన్నారు. ఇందులో భాగంగా జాతీయ రహదారి - 16పై అవసరమైన చోట్ల ఐరన్ సేఫ్ గార్డ్స్ తొలగించి, ఎయిర్ పోర్ట్ రహదారికి అనుసంధానం చేయాలని పోలీసు ఉన్నతాధికారులు సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారిని ఎయిర్ పోర్ట్ రహదారికి అనుసంధానం చేసే ప్రాంతాల వద్ద నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వీఐపీ వాహనాలను సన్ రే రిసార్ట్ మీదుగా ఎయిర్ పోర్ట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలానికి చేరుకొనే విధంగా చర్యలు చేపడుతున్నామని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు.

**ఎవరికీ ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేయాలి**

భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవ వేడుకను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని, వివిధ శాఖల అధికారులంతా పరస్పరం సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్ధసారథి ఆదేశించారు. ఆగస్టు 1న ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై మంత్రులు డోలా బాలాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్‌తో కలిసి భోగాపురం ఎయిర్‌పోర్టు పరిపాలన భవనంలో మంగళవారం ఉదయం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ప్రధాని సభా కార్యక్రమానికి హాజరయ్యే ప్రముఖులతోపాటు సామాన్య ప్రజలు సైతం ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం.. ఉత్తరాంధ్రకు సరికొత్త ఆర్థిక అధ్యాయం**

ఉత్తరాంధ్ర రూపు రేఖలను మార్చేలా అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం రూపుదిద్దుకుందని, ఇది 'గేట్‌వే ఆఫ్ గ్లోబల్ ఆంధ్రా'గా మారబోతోందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి పేర్కొన్నారు. మంగళవారం భోగాపురం విమానాశ్రయం పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు గారి గౌరవార్థం ఈ విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టడం ప్రతి తెలుగువాడికీ గర్వకారణమని అన్నారు. ఆగస్టు 1న ఈ విమానాశ్రయాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభించి, జాతికి అంకితం చేయనున్నట్లు వెల్లడించారు. సీఎం చంద్రబాబు విజన్, నిరంతర కృషితోనే ఈ ప్రాజెక్టు కల సాకారమవుతోందని మంత్రి కొనియాడారు. దాదాపు 2,203 ఎకరాలలో.. రూ.4,592 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఎయిర్‌పోర్టుకు మొదటి విడతలోనే 60 లక్షల (6 మిలియన్ల) ప్రయాణికుల సామర్థ్యం ఉందన్నారు. ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతాలుగా ఉన్న విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు ఈ ప్రాజెక్ట్ నూతన ఆర్థిక బలాన్ని చేకూరుస్తుందన్నారు. ఉత్తరాంధ్రలోనే సుమారు రూ.6.13 లక్షల కోట్ల పెట్టుబడులతో 189 ప్రాజెక్టుల పనులు ప్రారంభమయ్యాయని, వీటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 5.5 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. రాయలసీమలో రాయల్ ఎన్‌ఫీల్డ్, జెఎస్‌డబ్ల్యూ స్టీల్, రూ. 1.30 లక్షల కోట్ల హార్టికల్చర్ హబ్ వస్న్?న్నాయన్నారు. అలాగే కోస్తాంధ్రాలో ఆక్వా రంగానికి ప్రాధాన్యత ఇస్తూ అమరావతి రాజధాని పనులను వేగవంతం చేస్తున్నామని స్పష్టం చేశారు.

## వివరణ తీసుకోండి

నేరుగా ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను పిలిచి వివరణ తీసుకోవాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును సీఎం చంద్రబాబు ఆదేశించారు. అఖిలప్రియతో బుధవారం మాట్లాడాలని సీఎం సూచించారు.

## పోలీసుల తీరు సరికాదు

కాదన్నారు. విద్యార్థుల నిరసనను ఆయుధాలతో అణచివేయాలని పోలీసులకు ఎవరు ఆదేశాలు ఇచ్చారని ఆమె ప్రశ్నించారు. పేపర్ లీక్‌ల కారణంగా బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పిల్లల్ని కోల్పోయిన తల్లిదండ్రుల బాధ ఎవరు తీరుస్తారని ప్రశ్నించారు.

**విద్యామంత్రిగా ఆయన్ను అంగీకరించరు - రాహుల్**

కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషిని నియమించడాన్ని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుపట్టారు. విద్యాశాఖ మంత్రిగా ఆయన్ను ఈ దేశ మహిళలు అంగీకరించరని అన్నారు.

## రాజకీయాల కోసం వెళ్లలేదు

బంధువు, పైగా మా నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత. ఆ వ్యక్తిగత అనుబంధంతోనే నేను అక్కడికి వెళ్లాను తప్ప, ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయడానికో లేదా రాజకీయం చేయడానికో కాదు. దీనిపై జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదు" అని స్పష్టం చేశారు. అలాగే, 2019లో టీడీపీ ఓటమికి కాపు ఉద్యమమే కారణమంటూ తమ పార్టీ సీనియర్ నేత బొండా ఉమా చేసిన వ్యాఖ్యలను నెహ్రూ తీవ్రంగా తప్పుబట్టారు. "ఒక్క ఘటనను మాత్రమే పట్టుకుని ఒక పెద్ద సామాజిక వర్గానికి, పార్టీ ఓటమికి ముడిపెట్టడం సరికాదు. కాపులు ఎప్పుడూ రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే ప్రభుత్వాలకే అండగా నిలుస్తారు. మెజారిటీ కాపు సామాజికవర్గం ఎటు ఉంటే ఆ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది" అని విశ్లేషించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కాపుల సంక్షేమానికి, వికాసానికి పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందన్న జ్యోతుల నెహ్రూ... ప్రభుత్వం తరఫున కాపు సామాజిక వర్గానికి చేయాల్సిన ప్రతి మేలునూ ముందుండి నడిపిస్తామని నొక్కి చెప్పారు.

## చర్చకు నేనొస్తా...

దీనిని 'మెగా డీఎస్సీ' అని ప్రచారం చేసుకుంటున్నప్పటికీ, లోపల జరిగిన అక్రమాల వల్ల ఇది 'దగా డీఎస్సీ'గా మారిందని మండిపడ్డారు. మంత్రిగా లోకేశ్ విద్యాశాఖ బాధ్యతలను పక్కనబెట్టి మిగిలిన అన్ని శాఖల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని విమర్శించారు. కొంచెమైనా నైతికత ఉంటే ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు, డీఎస్సీ అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించి మంత్రి పదవికి లోకేశ్ రాజీనామా చేసేంత వరకు తమ పోరాటం ఆగేది లేదని హెచ్చరించారు. చంద్రబాబు ప్రభుత్వం కేవలం తమ సొంత ప్రచార సాధనాలు, పత్రికల ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఎమ్మెల్యే బొండా ఉమ మంత్రి పదవి కోసం తీవ్రంగా లాబీయింగ్ చేస్తున్నారంటూ చేశారు.

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి!

అధికారిణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 18న అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. శిక్షణ సమయంలో ఉదయ్ కృష్ణారెడ్డి తనను లైంగికంగా వేధించాడని, దాడికి పాల్పడటంతో పాటు వెంబడించి బెదిరించాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు తెలియకుండా ప్రైవేట్ వీడియోలు తీసి, వాటిని తన భర్తకు పంపి బ్లాక్ మెయిల్ చేశారని కూడా ఆమె ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద లైంగిక వేధింపులు, దాడి, వెంబడించడం, అక్రమ నిర్బంధం, క్రిమినల్ బెదిరింపులతో పాటు ఐటీ చట్టంలోని పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం ఈ కేసు దర్యాప్తును హైదరాబాద్ ఉమెన్స్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ పర్యవేక్షణలో విచారణ కొనసాగుతోంది. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ ఉదయ్ రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, ఆయనకు మధ్యంతర రక్షణ కల్పించేందుకు న్యాయస్థానం నిరాకరించింది. మరోవైపు, తాను పరారీలో లేనని, అనారోగ్యంతో ఉన్న తన నానమ్మను చూసేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఊళ్లపాలెం గ్రామానికి వెళ్లానని ఉదయ్ రెడ్డి మీడియాకు తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణలన్నీ పూర్తిగా అవాస్తవమని, విచారణకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో నమోదైన సెక్షన్లు, లభ్యమైన ఆధారాల ప్రకారం పారదర్శకంగా దర్యాప్తు జరుపుతామని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. అన్ని కోణాల్లోనూ విచారణ చేపడతామని ఆయన స్పష్టం చేశారు. కాగా, అంతర్గత విచారణలో ప్రాథమికంగా తప్పు తేలడంతో జాతీయ పోలీస్ అకాడమీ ఇప్పటికే ఉదయ్ కృష్ణారెడ్డిని శిక్షణ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

## ఇకపై ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఆ పార్టీ ఎంపీ ఆర్.కృష్ణయ్య పదేపదే ప్రశ్నిస్తున్నారు. ఆర్.కృష్ణయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న ఏపీలో బకాయిలపై ఆయన మాట్లాడరు. ఆ రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఉంది.. అక్కడి బకాయిలపై స్పందించి ఆ తర్వాత తెలంగాణ గురించి మాట్లాడితే బాగుంటుంది.

**గ్లోబరీనా తరహా సంస్థలపై కఠిన చర్యలు**

ఆఫ్‌లైన్‌లో పరీక్షల నిర్వహణతో సమస్యలు వస్తున్నాయి. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలి. విద్యాశాఖలో రాష్ట్ర పరిధి అధికారాలను కేంద్రం లాక్కునే ప్రయత్నం చేస్తోంది. యూనివర్సిటీలపై ఆధిపత్యం చెలాయించేందుకు యత్నిస్తోంది. విద్య.. వీలైనంత వరకు రాష్ట్ర పరిధిలో ఉంటే తప్పిదాలు జరగకుండా ఉంటాయి. కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో ప్రక్షాళనపై యోచిస్తాం. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టాం. పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాం. విద్యార్థులకు నమ్మకం కలిగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నాడు గ్లోబరీనా లాంటి సంస్థలు తెలంగాణలో అక్రమాలకు పాల్పడ్డాయి. నాటి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వల్ల సీబీఎస్ఈకి విస్తరించారు. గ్లోబరీనా తరహా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి. కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలోనూ దానికి సంబంధించిన చట్టాలు రూపొందిస్తాం" అని రేవంత్ అన్నారు.

**కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌తో సీఎం రేవంత్ భేటీ**

అంతకుముందు కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. పీఎంఏవై 2.0 పథకం కింద రాష్ట్రానికి 11.56లక్షల ఇళ్లు కేటాయించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణలో గ్రామీణ ఇళ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేశారని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎల్‌నినో నేపథ్యంలో వీబీ-జీ-రామ్‌జీలో అదనపు పనులు చేర్చాలని సీఎం విజ్ఞప్తి చేశారు. రైతుల జీవనోపాధి మెరుగుకు 10 కొత్త పనులను ఆ పథకం కింద చేర్చాలని కోరారు. కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్లు, మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపక షెడ్లకు అనుమతి కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పనులను వీబీ-జీ-రామ్‌జీ జాబితాలో చేర్చి లబ్ధిదారులకు 90 రోజులు పని కల్పించాలని కేంద్రమంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. రేవంత్ వెంట రాష్ట్రానికి చెందిన పలువురు ఎంపీలు ఉన్నారు.

## బ్యాంకాక్‌లో దారుణం..

ముగ్గురు యువకులు జులై 21న సముత్ ప్రాకాన్ ప్రావిన్సులోని సువర్ణ భూమి ఎయిర్‌పోర్టులో దిగారు. పట్టాయలోని కొందరితో ఏడు రోజుల (దాదాపు 1.99 లక్షల చెల్లించేలా) ప్యాకేజీ మాట్లాడుకుని టాక్సీలో అక్కడికి చేరుకున్నారు. ఆ తర్వాత వీరి దగ్గరకు వచ్చిన ఓ భారతీయుడు ఒక్కొక్కరిని తన బైక్‌పై ఓ నివాసానికి తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడ ఉన్న ఓ ముఠా వీరి కాళ్లు, చేతులు కట్టేసి బంధించింది. భారత్‌లో ఉన్న కుటుంబీకులతో మాట్లాడి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ క్రమంలో వారంపాటు చిత్ర హింసలకు గురిచేశారు. ఈ విషయాన్ని ఓ బాధితుడి బంధువు థాయ్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు దుండగులు వాడిన ఫోన్ నంబర్లు దుబాయిలో రిజిస్టర్ అయినట్లు గుర్తించారు. చివరకు మ్యాప్ టాటో రోడ్డులో ఉన్నట్లు కనుక్కొని ఆ ఇంటిపై దాడి చేశారు. వీరి రాకను పసిగట్టిన దుండగులు కొన్ని నిమిషాల ముందే పారిపోయినట్లు తెలిసింది.

# ఎడిటర్ వాయిస్

## ఏపీ కాంగ్రెస్ పీఠం కోసం పోటా పోటీ.. నిజమేనా?

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగియడంతోనే ఏపీ మీద కాంగ్రెస్ పెద్దలు దృష్టి సారిస్తారు అని అంటున్నారు. ఏపీ కాంగ్రెస్‌కి కొత్త నాయకత్వం జవ సత్వాలు ఇస్తారు అని అంటున్నారు.

ఏమో గుర్రం ఎగరావచ్చు అని సామెత ఒకటి ఉంది. ఏపీలో కాంగ్రెస్ ని చూస్తే అదే అనిపిస్తోంది. వరసగా జరిగిన మూడు సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ కి ఒక్క సీటు రాలేదు సరికదా అనేక చోట్ల డిపాజిట్లు కూడా పోయాయి. రెండు శాతం ఓటు షేర్ మాత్రమే దక్కుతూ వస్తోంది. అలాంటి కాంగ్రెస్ కి సారధ్యం వహించాలి అంటే చాలా మంది నేతలు మాకెందుకు వచ్చినా ఇబ్బంది అనుకుని పక్కకు తప్పుకునేవారు అని ప్రచారం సాగేది. విభజన తరువాత ఎక్కువ కాలం పీసీసీ చీఫ్ గా పనిచేసిన వారు మాజీ మంత్రి రఘువీరా రెడ్డి. ఆయన తరువాత మరో మాజీ మంత్రి సాకే శైలజానాథ్, ఆ తరువాత గోదావరి జిల్లాలకు చెందిన ఒక నేతకు కొంతకాలం చాన్స్ ఇచ్చారు. ఇపుడు వైఎస్ షర్మిల పీసీసీ చీఫ్ గా ఉన్నారు. అయితే తొందరలోనే ఏపీ కాంగ్రెస్ లో భారీ మార్పులు వస్తాయని ప్రచారం అయితే పెద్ద ఎత్తున సాగుతోంది.

**బలోపేతం చేసే దిశగా :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగియడంతోనే ఏపీ మీద కాంగ్రెస్ పెద్దలు దృష్టి సారిస్తారు అని అంటున్నారు. ఏపీ కాంగ్రెస్ కి కొత్త నాయకత్వం జవ సత్వాలు ఇస్తారు అని అంటున్నారు. ఈసారి సామాజిక తూకాన్ని కూడా పాటిస్తూ ప్రాంతీయ సమీకరణలను కూడా సరి చూసుకుంటారని అంటున్నారు. ఏపీలో ఒక బలమైన సామాజిక వర్గానికి ఈసారి పీసీసీ పీఠం దక్కవచ్చు అని అంటున్నారు. 2029 ఎన్నికలకు సమాయత్తం కావాలంటే ఇప్పటి నుంచే రంగంలోకి దిగాలని మొత్తంగా ప్రక్షాళన చేయాలని కూడా కాంగ్రెస్ భావిస్తోంది.

**పెద్దాయన రెడీనా :** ఇక గతంలో ఒక పెద్దాయనను కాంగ్రెస్ అధ్యక్ష పీఠం చేపట్టమని అడిగారని ప్రచారం సాగింది. అయితే ఆయన సున్నితంగా నో చెప్పారని కూడా అంటూ వచ్చారు. ఆయన కేంద్రంలో మంత్రిగా పనిచేసి కీలక శాఖలు చూసిన వారు, గోదావరి జిల్లాలకు చెందిన బలమైన సామాజిక వర్గం నేతగా ఉన్నారు. ఆయనకు పార్టీ బాధ్యతలు అప్పగిస్తే పార్టీ పుంజుకుంటుందని కూడా అంటున్నారు. గతంలో నో చెప్పిన ఆయన ఇపుడు సుముఖంగా ఉన్నారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దానికి కారణం మారిన జాతీయ స్థాయి పరిస్థితులు కాంగ్రెస్ కి దక్షిణాదిన ఒక్కసారిగా పెరిగిన బలంతో పాటు ఉత్తరాది రాజకీయాల్లో వస్తున్న మార్పులు అని అంటున్నారు.


**రేసులో చాలా మంది :** అంతే కాదు ఉత్తరాంధ్ర నుంచి ఒక కేంద్ర మాజీ మంత్రితో పాటు రాయలసీమ నుంచి కూడా పలువురు కీలక నేతలు పీసీసీ పీఠం చేపట్టడానికి ఆసక్తిగా ఉన్నారని ప్రచారం సాగుతోంది. గత ఎన్నికలు వేరు 2029 ఎన్నికలు వేరు అని కాంగ్రెస్ నేతలు భావించడమే ఇందుకు కారణం అని అంటున్నారు. ఈసారి కచ్చితంగా ఏపీలో కాంగ్రెస్ తన బలాన్ని నిరూపించుకుంటుందని లెక్క వేస్తున్నారు. దానికి జాతీయ స్థాయిలో నాయకత్వం రాహుల్ గాంధీ ఇమేజ్, బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మీద యాంటీ ఇంకెంబెన్సీ ఏపీలో విపక్ష శిబిరంలో ఉన్న రాజకీయ శూన్యత వంటివి కూడా తమకు కలసి వచ్చే అంశాలుగా విశ్లేషిస్తున్నారు. అన్నీ అనుకూలిస్తే కనుక ఏపీలో కాంగ్రెస్ జెండా గతంలో మాదిరిగా ఎగురుతుందని కూడా చాలా మంది నేతలు ఆశాభావంతో ఉన్నారు. ఎందు కంటే కాంగ్రెస్ భావజాలం అలాగే ఉందని దానిని జనం గట్టిగా పట్టుకున్నపుడు ఆటోమేటిక్‌గా గ్రాఫ్ పెరిగి తీరు తుందని విశ్లేషిస్తున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## రోడ్డు ప్రమాదంలో తిరుమల విద్యాసంస్థల చైర్మన్ సోదరుడి మృతి



**హనుమాన్‌జంక్షన్, విశ్వం వాయిస్ న్యూస్ :** కృష్ణా జిల్లా బాపులపాడు మండలం బొమ్మలూరు వద్ద చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, పక్కసీటులో ఉన్న అతని భార్యకు గాయాలయ్యాయి. మృతుడు రాజమహేంద్రవరానికి చెందిన తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ తిరుమల రావు సోదరుడు నున్నా సురేశ్‌గా గుర్తించారు. హనుమాన్ జంక్షన్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బాధితులు ఇవాళ తెల్లవారుజామున విజయవాడ వైపు నుంచి రాజమహేంద్రవరం వెళ్తుండగా ఘటన జరిగింది.

## డ్రగ్స్‌తో దొరికి.. పోలీసులను కారుతో ఢీకొట్టి..

**సీఐ, కానిస్టేబుళ్లకు గాయాలు - 2.5 కి.మీ. వెంటాడి నిందితుడి పట్టివేత**

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ అబిడ్స్‌లో ఓ యువకుడు కారులో కూర్చొని ఉన్నాడు. కొంతసేపటికి ఓ వ్యక్తి వచ్చి అతడికి డ్రగ్స్ ప్యాకెట్ ఇచ్చి వెళ్లిపోయాడు. అప్పటికే అక్కడ నిఘా ఉంచిన హెచ్‌న్యూ పోలీసులు ఆ యువకుడిని పట్టుకునేందుకు యత్నించారు. దీంతో అతను వారిని కారుతో ఢీకొట్టి పారిపోయాడు. ఈ ఘటనలో ఇన్‌స్పెక్టర్, ఇద్దరు కానిస్టేబుళ్లకు గాయాలైనప్పటికీ నిందితుడిని వెంబడించి పట్టుకున్నారు. సినీఫక్కీలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రాజధానిలో డ్రగ్స్ విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాపై హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్(హెచ్‌న్యూ) పోలీసులకు సమాచారం వచ్చింది. ఆదివారం మధ్యాహ్నం ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, కానిస్టేబుళ్లు మహేందర్‌యాదవ్, వంశీధర్ బృందం నిందితులను పట్టుకునేందుకు పోలీసు వాహనంలో బయల్దేరారు. అబిడ్స్‌లోని పాయల్ ఫుట్‌వేర్ వద్ద ఆగి ఉండగా.. కారులో కూర్చొని ఉన్న మహ్మద్ సైఫ్ అనుమానాస్పదంగా కనిపించాడు. అంతలోనే గుర్తుతెలియని వ్యక్తి వచ్చి సైఫ్‌కు ఓ ప్యాకెట్ ఇచ్చి మాయమయ్యాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు కారు వద్దకు వెళ్లి కిందకు దిగాలని సూచించారు. కారును పక్కకు తీస్తున్నట్టు నటించిన సైఫ్ వాహనాన్ని వేగంగా రివర్స్ చేసి పోలీసుల వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ క్రమంలో మహేందర్‌యాదవ్ కాలుకు తీవ్రగాయమవగా.. శ్రీకాంత్, వంశీధర్‌కు స్వల్పగాయాలయ్యాయి. అయినా నిందితుడిని 2.5 కి.మీ. దూరం వెంటాడి అఫ్జల్‌గంజ్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. మహేందర్‌ను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆయన ఫిర్యాదుతో అబిడ్స్, అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్లలో నిందితుడు సైఫ్‌పై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు.

**విలాసాలకు అలవాటై.. మత్తు దందా**

హుస్సేనీఆలం ముర్గీచౌక్‌కు చెందిన మహ్మద్ సైఫ్(30)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విలాస జీవితానికి అలవాటుపడి మత్తుపదార్థాలు విక్రయించటం ప్రారంభించాడు. ముంబయి, గోవాల్లోని డ్రగ్స్ ముఠాల ద్వారా కొకైన్, హెరాయిన్, ఎండీఎంఏ వంటి సింథటిక్ డ్రగ్స్ తెప్పించేవాడు. మూడేళ్లుగా గుట్టుగా సాగుతున్న ఈ దందాపై హెచ్‌న్యూ పోలీసులకు సమాచారం రావడంతో నిఘా ఉంచారు. అబిడ్స్‌లో సైఫ్‌కు డ్రగ్స్ ఇచ్చేందుకు వచ్చిన వ్యక్తి ముంబయికి చెందిన సమీర్‌గా పోలీసులు కనిపెట్టారు. సైఫ్ నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసిన వారినీ ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

## ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం.. యువతీయువకుడు మృతి

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని గచ్చిబౌలి సమీపంలో ఓఆర్ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువతీయువకుడు మృతి చెందారు. కారులో కొల్లూరు వైపు వెళ్తుండగా.. ఔటర్ రింగ్ రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరూ కారులోనే ఇరుక్కుపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతులను సురేందర్ (బొమ్మలరామారం), ప్రణీతి రెడ్డి (యాదాద్రి)గా గుర్తించారు. గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**నిక్కర్‌లో మూత్రం పోశాడని..**

## బాలుడి మర్మాంగంపై వాతలు

**వారణాసి, విశ్వం వాయిస్ న్యూస్ :** నర్సరీ విద్యార్థి పట్ల ఓ టీచర్ కర్కశంగా ప్రవర్తించింది. నిక్కర్‌లో మూత్రం పోశాడన్న కోపంతో చాకు వేడిచేసి బాలుడి మర్మాంగంపై వాతలు పెట్టింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో ఈ ఘటన చోటు చేసుకుంది. టీచర్, పాఠశాల ప్రిన్సిపల్‌పై కేసు నమోదైంది. కేసరి జయస్వాల్ కుమారుడు స్థానిక ప్రైవేటు ప్లే స్కూల్‌లో నర్సరీ చదువుతున్నాడు. శుక్రవారం పాఠశాల నుంచి వచ్చిన తర్వాత నొప్పిగా ఉందని తల్లికి చూపించాడు. వాతలు గమనించిన ఆమె.. మర్నాడు స్కూలుకు వెళ్లి వాకబు చేసినా యాజమాన్యం పట్టించుకోలేదు. వాష్ రూమ్‌కు వెళ్తానని అడిగినా టీచర్ పంపించకపోవడంతో మూత్రం ఆపుకోలేక నిక్కర్లో పోసేశాడని, కోపగించిన ఆమె..పక్క రూమ్‌కు తీసుకెళ్లి చాకు కాల్చి వాతలు పెట్టిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**అసలే అడ్డదారిలో ఉద్యోగం..**

## ఆపై అక్రమంగా ఆయుధాల సేకరణ

**శాప్‌లో షూటింగ్ శిక్షకుడి అరెస్టు - స్వాధీనం చేసుకున్న తుపాకులు, బుల్లెట్లు**



**గుంటూరు నేరవార్తలు, విశ్వం వాయిస్ న్యూస్ :** శిక్షణ పేరిట ఫోర్జరీ పత్రాలతో ఆయుధాలు సేకరించిన మైలా విజయహర్ష (27) అనే యువకుడిని సోమవారం గుంటూరులోని నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి మూడు తుపాకులు, 94 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు కేసు వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా పొన్నెకల్లుకు చెందిన విజయహర్ష ఎంఏ చదివాడు. నకిలీ పత్రాలు సృష్టించి రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)లో షూటింగ్ శిక్షకుడిగా ఔట్ సోర్సింగ్‌లో ఉద్యోగం సంపాదించాడు. ప్రస్తుతం చిత్తూరులో పని చేస్తున్నాడు. శిక్షణ నిమిత్తం శాప్ అనుమతులతో ఆయుధాలు సేకరించాల్సి ఉండగా, విజయహర్ష అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి, వాటినే కలెక్టర్‌కు సమర్పించి ఆయుధాల సేకరణకు అనుమతులు పొందాడు. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారు. హర్ష నకిలీ పత్రాలతో ఆయుధాలు సేకరించినట్లు గుర్తించి నగరంపాలెంలో అరెస్టు చేశారు. అతని నుంచి 22 రైఫిల్, 12 బోర్ షాట్ గన్, 380 పిస్టల్, 50 రౌండ్ల బుల్లెట్లు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 380 పిస్టల్ అసలైనది. ఇందులో వాడే 9ఎంఎం బుల్లెట్లు ఆరు రౌండ్లు, 380 సైజువి 44 రౌండ్లు ఉండడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.



# విశ్వవాయిస్

అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు

బుధవారం, 29 జూలై, 2026

4

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బద్ధత

www.viswamvoice.com





# 'విశ్వం వాయిస్' అక్షర యోధానికి అధికారుల జైకొట్టు!


- కలెక్టర్ ఆదేశాలు.. గంటల్లో మారిన రౌతులపూడి తహశీల్దార్ ఆఫీస్ చిత్రం!
- నిన్నటి 'గ్రహణం' కథనానికి నేడు అక్షర సమాధానం
- బోసపోయిన RTI బోర్డుపై వెలిసిన అధికారుల నంబర్లు

నిన్నటి కథనం










**'విశ్వం వాయిస్ ప్రభావం'**

ప్రజల వైపు నిలబడి, వారి ప్రాథమిక హక్కుల సాధనకు పత్రికలు పనిచేసినప్పుడు మార్పు ఎంత వేగంగా వస్తుందో నిరూపించేందుకు రౌతులపూడి తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ పరిణామమే ప్రత్యక్ష నిదర్శనం!

**ఏం జరిగింది? (కథనం నేపథ్యం):**

కాకినాడ జిల్లా రౌతులపూడి మండల తహశీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంబోర్డు పేర్లు, ఫోన్ నంబర్లు లేకుండా ఖాళీగా దర్శనమివ్వడంపై నిన్నటి సంచికలో 'విశ్వవాయిస్' దినపత్రిక ప్రత్యేక కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే. "ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రాథమిక హక్కులకే గ్రహణం!" శీర్షికన ప్రచురితమైన ఈ కథనం జిల్లా యంత్రాంగంలో తీవ్ర చలనాన్ని తెచ్చింది. పత్రికలో వచ్చిన కథనం కాకినాడ జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత రెవెన్యూ అధికారుల దృష్టికి వెళ్లడంతో అధికారులు తక్షణమే కార్యాచరణకు దిగారు.

**గంటల వ్యవధిలోనే మారిన దృశ్యం!**

పత్రిక వార్త వెలువడిన వెంటనే స్పందించిన రౌతులపూడి రెవెన్యూ అధికారులు, కార్యాలయ ప్రాంగణంలోని ఖాళీ సమాచార హక్కు బోర్డును పునరుద్ధరించారు. బోర్డుపై స్పష్టంగా అధికారుల వివరాలు, వారి హోదాలు మరియు నేరుగా సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లను పెయింట్ చేయించారు:

పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ : ఎస్.వి. నరేష్ (డిప్యూటీ తహశీల్దార్) - 9704429999

అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్: సీనియర్ అసిస్టెంట్ (ప్రస్తుతం పోస్టు వేకెంట్)

అప్పిలేట్ అథారిటీ ఆఫీసర్: పి.కృష్ణమూర్తి (రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ - RDO)- 9849903865.

**అధికారులకు, 'విశ్వవాయిస్'కు ప్రశంసలు**

ప్రజా సమస్యలపై నిర్భయంగా వార్తలు రాస్తూ సమాజంలో మార్పుకు శ్రీకారం చుడుతున్న 'విశ్వవాయిస్' యాజమాన్యానికి, ప్రతినిధులకు స్థానిక ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. వార్త రాగానే దాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, వెంటనే స్పందించి బోర్డుపై సమాచారం అందుబాటులో ఉంచిన తహశీల్దార్ కార్యాలయ అధికారులకు, సిబ్బందికి కూడా ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

**విశ్వవాయిస్ ఆకాంక్ష**

"పత్రికల పని కేవలం సమస్యలను వేలెత్తి చూపడమే కాదు... వాటికి పరిష్కారం లభించేలా అధికారులకు, ప్రజలకు మధ్య వారధిగా నిలవడమే అసలైన పాత్రికేయం. ప్రజా సమస్యలపై 'విశ్వవాయిస్' పోరాటం నిరంతరం కొనసాగుతుంది."

## కల్వకొలను వీధి వేపచెట్టు అమ్మవారికి శాకాంబరి దేవి మహా అలంకారం



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆషాఢ మాస పర్వదినాన్ని పురస్కరించుకుని కల్వకొలను వీధి వేపచెట్టు అమ్మవారికి అన్ని రకాల తాజా కాయగూరలు, ఆకుకూరలు, పండ్లతో అత్యంత వైభవంగా శాకంభరి దేవి అలంకారం నిర్వహించబడింది. ఈ దివ్య అలంకారంలో అమ్మవారు భక్తులకు కనువిందు చేస్తున్నారు. కావున భక్తులందరూ విచ్చేసి అమ్మవారి దివ్య దర్శనం చేసుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించి, అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావలసిందిగా ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

## వైసీపీ నేతలకు కడుపు మంట చల్లారడం లేదు

**రవి కుమార్ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి**

**మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎంత మంది చదువుకునే బిడ్డలు ఉంటే అంత మందికి తల్లికి వందనం అమలు చేస్తుంటే వైసీపీ నాయకులకు కడుపు మంట చల్లారడం లేదని మాదిగ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్ (దొరబాబు) విమర్శించారు. మండపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో దొరబాబు పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి వైసీపీ నేతలకు కంటి మీద కునుకు లేకుండా పోయిందన్నారు. కూటమి ప్రభుత్వం కూడా జగన్ సతీమణి భారతమ్మ మోసం చేసినట్టు మోసం చేసి ఉంటే వారికి బాగుండేదన్నారు. ఎంత మంది ఉంటే అంతమంది కి అమ్మ ఒడి ఇస్తామని చెప్పి అధికారం లోకి వచ్చిన తర్వాత ఆ హామీని వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. కూటమి కూడా అలాగే చేసి ఉంటే అప్పుడు ఈ రవి కుమార్ కడుపు మంట చల్లబడేదన్నారు. ప్రజలు సంతోషంగా ఉండటం వీరికి ఇష్టం లేదన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా రాష్ట్రంలో ఎందరో తల్లులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ పథకం ద్వారా ఒక కుటుంబంలో సుమారు లక్ష రూపాయలు దగ్గరగా అందుకున్న వారు సైతం ఉన్నారన్నారు. దేశం లో ఇంకే ప్రభుత్వం అమలు చేయలేని విధంగా రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం సంక్షేమానికి పెద్ద పీట వేసిందన్నారు. వేలాది మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి ఉపాధ్యాయులకు సైతం కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు.అలాగే జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా కొత్త పాఠ్యపుస్తకాలు, డిజిటల్ కంటెంట్ అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. చిన్న తరగతుల విద్యార్థులు చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలను మెరుగుపరచడం వంటి విషయాలపై ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో కృత్రిమ మేధస్సు, స్టెమ్, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక విద్యను ప్రవేశపెట్టే చర్యలు ప్రారంభించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీ స్థాయిలో తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించి పాఠశాలలతో కుటుంబాల అనుసంధానాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో యువనేత నారా లోకేష్ అద్భుతమైన విద్యా ప్రణాళికలతో ముందుకు వెళుతుంటే రాజకీయ దురుద్దేశ్యంతో చవకబారు ఆరోపణలు చేయడం వైసీపీ నేతలకు తగదన్నారు. ప్రజలు అన్నిటిని గమనిస్తున్నారని, ఇప్పటికైనా రాజకీయ పబ్బం కోసం వైసీపీ నేతలు ఇలాంటి ఆరోపణలు చేయడం మానుకోవాలని దొరబాబు సూచించారు.

**కందికట్ల అరుణ కుమారి ఆధ్వర్యంలో**

## గ్రామ సంఘం సహాయకులకు శిక్షణ కార్యక్రమం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం స్థానిక మండల సమాఖ్య స్త్రీశక్తి భవనం నందు కందికట్ల అరుణకుమారి ఆధ్వర్యంలో లూకుస్ నందు గ్రామ సంఘం యొక్క కట్ ఆఫ్ సీట్స్ మరియు ఆర్థిక లావాదేవీలు నమోదు కొరకు మండల సమాఖ్య పరిధిలో ఉన్న 59 మంది గ్రామ సంఘం సహాయకులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఏపిఎం సూరమ్మ మాట్లాడుతూ లోకోస్ యాప్ యొక్క విధి విధానాలు మరియు ప్రాధాన్యత వివరించి శిక్షణ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ట్రైనింగ్ ఆఫ్ ది ట్రైనర్ గా వచ్చిన క్లస్టర్ కోఆర్డినేటర్ పద్మారావు శిక్షణ ఇవ్వడం జరిగింది. గ్రామ సంఘం యొక్క మూల నిధులు, లాభనష్టాలు,సంఘాల్లో ఉన్న అప్పు, నిల్వ,ఉన్నతి,వీఆర్ఎఫ్ గ్రామ సంఘం అంతర్గత అప్పులు, పొదుపులు, సభ్యత్వం, డిపాజిట్లు మొదలైన అన్ని రకాల ఆర్థిక లావాదేవీలు యాప్ నందు ఏ విధంగా నమోదు చేయాలి అనేది యాప్ ద్వారా వివరించి అందరికీ శిక్షణ నిమిత్తం ఫార్మాట్ ఇచ్చి చెప్పడం జరిగింది.గ్రామ సంఘం యొక్క ఆర్థిక లావాదేవులు 31/3/ 2026 నాటికి తీసుకుని సదరు నిల్వలు లోగోస్ యాప్ నందు కట్ ఆఫ్ సీట్స్ నందు నమోదు చేసి సర్వర్ కి పంపాలన్నారు. మరియు ఏప్రియల్ 2026 నుండి ప్రతినెల సమావేశాలు నిర్వహించి ఆన్లైన్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో క్లస్టర్ కో ఆర్డినేటర్ హరిబాబు, తిలక్,ధారా లక్ష్మి, మరియు గ్రామ సంఘం సహాయకులు పాల్గొన్నారు.

## కూటమి నేతలు హామీలకే పరిమితం....

**విద్యార్థుల భవిష్యత్తుకు అమ్మఒడి పథకం వైసిపితోనే మొదలు - వైసిపి ఆర్టీ విభాగ కన్వీనర్ మందపల్లి రవి**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం వచ్చాకా 972 పాఠశాలలు మూతపడింది వాస్తవమా కదా అంటూ మాజీ కౌన్సిలర్ వైసిపి ఆర్టీ విభాగం కన్వీనర్ మందపల్లి రవి కుమార్ పేర్కొన్నారు.చేసింది తప్పైనా కప్పిపుచ్చే ధోరణి కూటమి ప్రభుత్వానికే సాధ్యమని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో కూటమి నాయకులు చంద్రబాబు నాయుడు తనయుడు లోకేష్ తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఎటువంటి షరతులు లేకుండా బేషరతుగా తల్లికి వందనం ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తానని ప్రజలకు ఎన్నికల వాగ్దానం చేసిన విషయాన్ని మరిచిపోయారా అంటూ గుర్తు చేశారు. గణాంకాలు ప్రకారం 972 గవర్నమెంట్ స్కూళు మూయించారని ఆరోపించారు. ఇది మీడియా ముందు ఉంచితే, తల్లికి వందనం వ్యవహారంలో తప్పులు చేసినప్పటికీ తప్పుదారి పట్టిస్తున్నారనడం విడ్డూరంగా ఉందన్నారు. అందులో 778 ప్రభుత్వం 194 ఎయిడెడ్ పాఠశాలలుగా ఉన్నాయని తెలిపారు. యు డి ఐ ఎస్ ఈ నివేదిక ఆధారంగానే 87 లక్షల మంది పిల్లలకు తల్లికి వందనం చెల్లించాలని రవి తెలిపారు. ప్రస్తుతం మండపేటలో 1337 మంది అనర్హత పేరుతో తల్లికి వందనం వారి ఖాతాలలో వేయలేదని మందపల్లి రవి తెలిపారు . అదేవిధంగా మండపేట మండలంలో 976 రాయవరం మండలంలో 934 కపిలేశ్వరపురం మండలంలో 585 మంది విద్యార్థులకు తల్లికి వందనం యగనామం పెట్టారన్నారు. మొత్తానికి మండపేట నియోజకవర్గం లో 3832 మంది విద్యార్థులకు అన్యాయం జరిగిందని రవి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 22.55 లక్షల మంది విద్యార్థులకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు . 2024-25 సంవత్సరంలో తల్లికి వందనం పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. 87.41 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం రూపంలో ప్రభుత్వం 13,112.82 కోట్లు నిధులను కేటాయించాలన్నారు. కూటమి ప్రభుత్వం మొదటి సంవత్సరం తల్లికి వందనం ప్రస్తావనే లేకుండా తల్లులను మోసం చేశారన్నారు. 2025- 26 సంవత్సరంలో 6377 కోట్లు మాత్రమే కేటాయించి తల్లిలందరికీ తల్లికి వందనం వేశామని అసత్య ప్రచారాలతో ప్రజలను మోసం చేస్తున్నారని మందపల్లి రవి తెలిపారు. 2026-27 సంవత్సరానికి 10,120.78 కోట్ల నిధులకే పరిమితం చేశారన్నారు. విడుదల చేసిన నిధులకే అర్హులైన విద్యార్థులకు పొంతన లేకుండా తల్లికి వందనం పూర్తిస్థాయిలో అమలు చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. 22.55 లక్షలమంది అర్హులైన విద్యార్థులకు తల్లికి వందనం ఇవ్వకుండా మోసం చేశారన్నారు. ఇంకా 22,840.68 కోట్ల బకాయి విద్యార్థులకు మూడు సంవత్సరాలకు చెల్లించాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ గురించి ఏ రాజకీయ పార్టీలు అలోచన చేయని రోజుల్లో వైఎస్ఆర్సీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి ఆలోచనలో భాగంగా ఆవిర్భవించిందే అమ్మఒడి అన్నారు. అలాంటి ఈ పథకాన్ని కాపీ కొట్టి పేరు మార్చినంత సులువుగా పథకాన్ని అమలుచేయలేక తల్లులకు సమాధానం చెప్పలేని మ అసమర్థతను కప్పిపుచ్చుకోలేక కడుపుమంట గా ఉందనే విషయం రాష్ట్ర ప్రజలకు అర్థమైందని పేర్కొన్నారు.

## కేబుల్ వైర్లలో చెలరేగిన మంటలు

**తప్పిన పెను ప్రమాదం - తక్షణం స్పందించిన విద్యుత్ శాఖ**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేటలో అతిరద్దీ గా ఉండే ప్రాంతం మండపేట కలువపువ్వు సెంటర్. అనునిత్యం ఇక్కడ జనం తిరుగుతూ ఉంటారు. ఇక్కడ రహదారికి నాలుగు వైపుల విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. వీటికి ప్రైవేటు ప్రభుత్వ కేబుల్ టీవీ, ఇంటర్ నెట్ వైర్లు ఇబ్బడి ముబ్బడిగా ఉన్నాయి. డజను ప్రైవేటు సంస్థ కేబుల్ వైర్ల ఈ స్తంభాలకు పొదరిల్లు లా చుట్టుకుని అల్లుకొని ఉంటాయి. వాస్తవానికి ప్రతి సంస్థ తమకోసం ప్రత్యేక స్తంభాలు వేసుకొని వైర్లను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. కాగా మండపేట లో ఆ అనవాయితీ లేదు. అన్ని ట్రాన్స్ కో పోల్స్ కు అన్ని ప్రైవేటు కేబుల్ వైర్లు ఎప్పుడూ వేలాడుతూనే ఉంటాయి.ఈ నేపథ్యంలో మంగళవారం కలువ పువ్వు సెంటర్ లో శ్రీ దేవి ఆలయం ఎదురుగా కార్నర్ లో ఉన్న కరెంటు స్తంభానికి షార్ట్ సర్క్యూట్ తో అగ్ని రాజుకుంది. దీంతో స్తంభం చుట్టూ ఉన్న కేబుల్ వైర్లు అంటుకున్నాయి. పెద్దగా మంటలు ఎగసి పడ్డాయి. ఈ క్రమంలో స్థానికులు వెంటనే ట్రాన్స్ కో సిబ్బంది కి ఫిర్యాదు చేశారు. తక్షణం సిబ్బంది అప్రమత్తమై విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అక్కడి చేరుకొని మంటలను ఆర్పివేశారు. దీంతో పెను ముప్పు తప్పింది. అక్కడ ఎక్కువ మంది ఎపుడు నిలిచి ఉంటారు. దీంతో విద్యుత్ షాక్ గురైతే పెద్ద ప్రమాదం జరిగి ఉండేది. గతంలో ఈ వైర్లను తొలగించాలని కమీషనర్ టీవీ రంగారావు అన్ని కేబుల్ ఆపరేటర్ లకు నోటీసులు ఇచ్చారు. అయినప్పటికీ వైర్లను ఎవరు తొలగించలేదు. దీంతో ఇటువంటి ప్రమాదాలు తరచూ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రజలు విమర్శలు చేస్తున్నారు.


మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!

నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!

- బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
- రోజువారీ తెలుగు దినపత్రిక PDF
- అంతర్జాతీయ, జాతీయ వార్తలు
- విశ్లేషణాత్మక కథనాలు

VISWAM VOICE BREAKING NEWS

WhatsApp channel

మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి

JOIN NOW

లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:

https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E

మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.



## సమన్వయంతో ముందుకు సాగుదాం...

# ప్రభుత్వ విజయాలను ప్రతి ఇంటికి తీసుకెళ్దాం

**కోనసీమ అభివృద్ధికి కూటమి కంకణం - జిల్లా సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి వాసంశెట్టి సుభాష్**



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అభివృద్ధి - సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేయడంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో ముందుకు సాగి ప్రభుత్వ విజయాలను ప్రతి ఇంటికి చేర్చాలని పిలుపునిచ్చారు. ప్రతినెలా ఒక ఎమ్మెల్యే నివాసంలో నిర్వహిస్తున్న సమన్వయ సమావేశం మంగళవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్వగృహంలో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం మళ్లీ అభివృద్ధి బాట పట్టిందన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. పరిశ్రమలు రాష్ట్రాన్ని వీడిపోయాయని, యువత ఉపాధి అవకాశాలు కోల్పోయారని, రైతులు, ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. విధ్వంసం చేయటం సులువని, అభివృద్ధి చేయడానికి ఎంతో దూరదృష్టి కావాలని మంత్రి అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, మహిళా సాధికారత, ఉపాధి కల్పన వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు. "తల్లికి వందనం", మెగా పీటీఎం, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. సోషల్ మీడియా, ఇంటింటి ప్రచారం, గ్రామస్థాయి సమావేశాల ద్వారా ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. జగన్ పాలనలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు తిరిగి ప్రారంభమయ్యాయని, కోనసీమ జిల్లాకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ రహదారులు, విద్యా సంస్థలు, వైద్య సేవలు, వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ సమావేశంలో పార్టీ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు, మండపేట శాసనసభ్యులు వేగుళ్ల జోగేశ్వరరావు, అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి అందం పల్లంరాజు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాజోలు ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య, తెదేపా సీనియర్ నాయకులు, పి.గన్నవరం నియోజకవర్గ టూ-మెన్ కమిటీ సభ్యులు మోకా ఆనంద్ సాగర్, డి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మస్కట్ వేధింపుల నుంచి కోనసీమ మహిళకు విముక్తి



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మస్కట్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న అమలాపురం మండలం రంగాపురం సమనస గ్రామానికి చెందిన చుట్టుగుల్ల వెంకటలక్ష్మిని జిల్లా యంత్రాంగం, కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ సమన్వయంతో సురక్షితంగా స్వదేశానికి రప్పించింది. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా 2025 నవంబర్‌లో ఉపాధి కోసం మస్కట్ వెళ్లిన వెంకటలక్ష్మికి అక్కడ సరైన ఉద్యోగం లభించకపోవడంతో రెండు నెలల పాటు ఏజెంట్ కార్యాలయంలోనే ఉంచారు. అనంతరం గృహ కార్మికురాలిగా నియమించిన ఇంట్లో తొమ్మిది మంది పిల్లల సంరక్షణతో పాటు అన్ని ఇంటి పనులు చేయాల్సి వచ్చిందని, యజమాని భార్య తరచూ శారీరక, మానసిక వేధింపులకు గురిచేసిందని ఆమె తెలిపింది. ఒక దశలో తీవ్రంగా కొట్టి తిరిగి ఏజెంట్ కార్యాలయానికి పంపించగా, రూ.4 లక్షలు చెల్లిస్తేనే భారతదేశానికి పంపిస్తామని చెప్పినట్లు వెల్లడించింది. ఈ విషయమై బాధితురాలి భర్త సూర్యనారాయణ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల ఆదేశాల మేరకు ఆ ఫిర్యాదును కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌కు అప్పగించారు.కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ నోడల్ అధికారి వి.సుబ్బారావు, సమన్వయకర్త గోళ్ళ రమేష్ ఆధ్వర్యంలో సంబంధిత ఏజెంట్‌తో నిరంతర సంప్రదింపులు జరిపి, బాధితురాలి పరిస్థితిని వివరించి, కుటుంబ సభ్యులు మరియు ఏజెంట్ సహకారంతో ఆమెను సురక్షితంగా భారతదేశానికి తీసుకువచ్చారు. భారతదేశానికి చేరుకున్న అనంతరం వెంకటలక్ష్మి తన భర్తతో కలిసి జాయింట్ కలెక్టర్‌ను కలిసి, తమకు అండగా నిలిచిన జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగం, కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడియాల సత్తిబాబు, షేక్ బీబి సఫియా తదితరులు పాల్గొన్నారు.

### డీఎస్సీ అక్రమాలపై

## సీబీఐ దర్యాప్తు కోరుతూ వైసీపీ ఆందోళన

**కలెక్టరేట్ ఎదుట వైసీపీ యువజన, విద్యార్థి విభాగాల ధర్నా**

**ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయాలి : వైసీపీ**



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం వైసీపీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ పినిపే శ్రీకాంత్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విస్మరించిందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగ భృతిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.డీఎస్సీ నియామకాలలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో విచారణ జరిపించాలని, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు జక్కంపూడి రాజా, జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ యువత, విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. యువతకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, బొమ్మి ఇజ్రాయిల్, కుడిపూడి సూర్యనారాయణరావు, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్, రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఒంటెద్దు వెంకన్న నాయుడు, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి యువజన, విద్యార్థి విభాగ నాయకులు, పార్టీ కార్యకర్తలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రహదారి భద్రతకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి

**ఎన్‌హెచ్-216పై పోలీస్, రవాణా, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారి అధికారుల సంయుక్త సర్వే**

**చించినాడ బ్రిడ్జి రాకపోకలకు ముందస్తు భద్రతా చర్యలు**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** చించినాడ బ్రిడ్జి త్వరలో పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్‌హెచ్-216 రహదారిపై రహదారి భద్రతా ఏర్పాట్లను పరిశీలించేందుకు పోలీస్, రవాణా, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారుల శాఖ అధికారులు మంగళవారం సంయుక్త సర్వే నిర్వహించారు.పాశర్లపూడి, పాశర్లపూడి బైపాస్, గెద్దాడ, కడలి, ములికిపల్లి జంక్షన్, గెద్దాడ బైపాస్, చించినాడ-మలికిపురం జంక్షన్ తదితర ప్రాంతాల్లో పెరిగే ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రమాద హెచ్చరిక బోర్డులు, వీధి దీపాలు, క్రాస్ రోడ్ల వద్ద డబుల్ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అధికారులు గుర్తించారు. గెద్దాడలోని ఎడ్యుకేర్ స్కూల్, ములికిపల్లిలోని నలంద స్కూల్ వద్ద విద్యార్థుల భద్రత కోసం స్పీడ్ బ్రేకర్లు, స్కూల్ జోన్ హెచ్చరిక బోర్డులు, సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించాలని అధికారులు కోరారు.అదేవిధంగా మామిడికుదురు రహదారిపై ఉన్న అక్రమణలను సర్వే సందర్భంగా తొలగించారు. గెద్దాడ--ములికిపల్లి మార్గంలో రహదారి విస్తరణకు ఆటంకంగా ఉన్న ఐదు విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాల్సిన అవసరం ఉందని గుర్తించారు. ఈ నెల నిర్వహించే జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో ఈ అంశాలను చర్చించి, జిల్లా కలెక్టర్, కమిటీ చైర్మన్ ఆమోదంతో అవసరమైన చర్యలు చేపడతామని జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సంయుక్త సర్వేలో ఆర్‌అండ్‌బీ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్, జాతీయ రహదారుల అధికారి వెంకటరమణ, నగరం ఎస్ఐ పద్మారావు, రాజోలు ఎస్ఐ రామకృష్ణారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

### విషాద ఘటన..

## నిద్రలోనే మహిళ దుర్మరణం



**ఉప్పలగుప్తం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉప్పలగుప్తం మండలం చల్లపల్లిలో మంగళవారం తీవ్ర విషాదం చోటు చేసుకుంది. భారీ వర్షం కురవడంతో ఒక పాత భవనం శ్లాబ్ ఒక్కసారిగా కూలిపోవడంతో ఇంట్లో నిద్రిస్తున్న కొల్లు సత్యవతి(50) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన ఆమె భర్త, కుమారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు.

### పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారికి

## డీటీఓ అభినందనలు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పంచాయతీ రాజ్ ఇంజ నీరింగ్ శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పదోన్నతి పొందిన పులి రామకృష్ణా రెడ్డిని జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆయన కార్యాలయ ఛాంబర్‌లో జరిగిన ఈ భేటీలో పులి రామకృష్ణారెడ్డి ఉన్నత పదవిలో మరింత సమర్థవంతంగా సేవలందించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇద్దరు అధికారులు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

### కామనగరువులో ఎమ్మెల్యే ఆనందరావు

## ఇంటింటి ప్రచారం

**ప్రజల సమస్యలకు తక్షణ స్పందన.. అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే**



**అమలాపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా అమలాపురం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న '2 ఏళ్ల నమ్మకం- అభివృద్ధి, సంక్షేమం: ఇంటింటి ప్రచార కార్యక్రమం రెండో రోజు కామనగరువు గ్రామంలో ఉత్సాహంగా సాగింది. స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గ్రామంలో విస్తృతంగా పర్యటించి ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. పర్యటనలో భాగంగా గ్రామంలోని ఓ వీధికి రోడ్డు సౌకర్యం లేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే స్పందించారు. పంచాయతీ కార్యదర్శిని అక్కడికక్కడే పిలిపించి సమస్యను పరిశీలించి, రోడ్డు నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి ప్రభుత్వం గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే గ్రామస్తుల సమస్యలు, సూచనలను స్వయంగా అడిగి తెలుసుకుని, వచ్చిన ఫిర్యాదులను మైటీడీపి యాప్‌లో నమోదు చేయించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు వనమాడి సునీత, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్

**అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరిస్తున్నాం**

**టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు రెడ్డి సుబ్రహ్మణ్యం**



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలనే లక్ష్యంతో చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం అంబాజీపేట మండలంలోని పుల్లేటికుర్రు గ్రామంలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు రెడ్డి సుబ్రహ్మణ్యం పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి. గన్నవరం నియోజకవర్గ పరిధిలోని పుల్లేటికుర్రు గ్రామం వీవర్స్ కాలనీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సూపర్ సిక్స్' పథకాలు ప్రజల్లో విశేష ఆదరణ పొందాయని పేర్కొన్నారు. ప్రతి నెల 1వ తేదీన ఇంటి వద్దకే రూ.4,000 పింఛన్ పంపిణీ, చేనేత కార్మికులకు 50 ఏళ్లకే పింఛన్, మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 'తల్లికి వందనం' పథకం ద్వారా విద్యార్థులకు రూ.15,000, 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా రైతులకు ఏడాదికి రూ.20,000 అందిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పూర్తి, రహదారుల ఆధునీకరణ, పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం వేగంగా పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-కన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ (డీవీ), మండల పార్టీ అధ్యక్షుడు గుడాల ఫణి, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాంబాబు, బూత్ కన్వీనర్లు కాసా నాగమల్లేశ్వరరావు, చిటూరి హరికృష్ణ, మర్రి రామకృష్ణ, కేశవతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, టీడీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డీఎస్సీ అక్రమాలపై న్యాయ విచారణ జరిపించాలి

**వైసీపీ రాజోలు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పాముల రాజేశ్వరి దేవి**



**రాజోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై న్యాయ విచారణ జరిపించాలని, నిరుద్యోగులకు హామీ ఇచ్చిన భృతి వెంటనే అమలు చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజోలు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పాముల రాజేశ్వరి దేవి డిమాండ్ చేశారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో అమలాపురం కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి మద్దతుగా మంగళవారం గెద్దాడ గ్రామంలో జాతీయ రహదారి-216పై పార్టీ జెండా ఊపి మోటార్‌సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీఎస్సీ నియామకాలపై స్వతంత్ర న్యాయ విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. నిరుద్యోగ భృతి వెంటనే విడుదల చేయడంతో పాటు విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## డీఎస్సీ అక్రమాలపై లోకేష్ రాజీనామా చేయాలి



**జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి డిమాండ్**

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డీఎస్సీ నియామక ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు. అమలాపురంలో డీఎస్సీ అక్రమాలకు నిరసనగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా నైతిక బాధ్యతకు సంబంధించిన అనేక ఉదాహరణలు ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం అదే ప్రమాణాలు ఎందుకు అమలు కావడం లేదని ప్రశ్నించారు. డీఎస్సీ నియామక ప్రక్రియపై వచ్చిన ఆరోపణలపై స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని కోరారు. సుమారు 3.5 లక్షల మంది డీఎస్సీ అభ్యర్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ అంశంలో ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో వ్యవహరించి నియామక ప్రక్రియకు సంబంధించిన అన్ని వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా అభ్యర్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. డీఎస్సీ అభ్యర్థులకు అన్యాయం జరిగితే రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా నిరుద్యోగ యువత ప్రభుత్వాన్ని క్షమించదని హెచ్చరించారు. అనంతరం అమలాపురం కలెక్టరేట్ ఎదుట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొని డీఎస్సీ అక్రమాలపై ఆందోళన వ్యక్తం చేశారు.

## గంటి శ్రీనివాస్‌కి అక్షయ ఆర్థిక సహాయం



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** పెనుగొండ మండలం వడలి గ్రామానికి చెందిన గంటి శ్రీనివాస్ కు కొన్ని రోజుల క్రితం వడలి నుంచి నరసాపురం బాజారుకి బస్సు దిగి వెళ్తుంటే కారు గుద్దేయడం జరిగింది అనిఒక కాలు విరగడం వలన రాడ్ వేసి ఆపరేషన్ చేశారు అని ఆరు నెలల వరకు మందులు వాడాలని వైద్యులు చెప్పారు. వీళ్ళ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కారణంగా అక్షయ సేవా సంస్థను సహాయం కోరగా.10000 రూపాయలు సంస్థ సభ్యుల చేతుల మీదగా శ్రీనివాస్ భార్యకి ఇవ్వడం జరిగింది. దీనికి సహకరించిన సభ్యులందరికీ ధన్యవాదములు తెలియజేశారు.

### పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీపై

## వైఎస్సార్‌సీపీ కొత్త డ్రామా : అక్కల రిష్వంత్ రాయ్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియపై వైఎస్సార్‌సీపీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవని చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్ విమర్శించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన డీఎస్సీ నియామక ప్రక్రియను అడ్డుకోవాలనే ఉద్దేశంతో నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి కోర్టుల్లో వందలాది పిటిషన్లు దాఖలు చేయడం వైఎస్సార్‌సీపీ వైఖరిని స్పష్టం చేస్తోందని ఆయన అన్నారు. నిరుద్యోగుల ప్రయోజనాల కోసం కాకుండా రాజకీయ లబ్ధి కోసం ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. 1994 నుంచి 2025 వరకు రాష్ట్రంలో మొత్తం 14 డీఎస్సీల ద్వారా 1,96,619 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయ్యాయని తెలిపారు. 2024 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం కేవలం 150 రోజుల్లోనే 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి తన నిబద్ధతను చాటుకుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఉపాధ్యాయులను విద్యా సంబంధిత విధులకు బదులుగా మద్యం దుకాణాల వద్ద విధులు నిర్వహించే పరిస్థితి తీసుకువచ్చారని విమర్శించారు. ఆ పాలనపై సమాధానం చెప్పకుండా ఇప్పుడు డీఎస్సీ నియామకాలపై ఆరోపణలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని అన్నారు. డీఎస్సీలో అర్హత సాధించి ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల విజయాన్ని కూడా రాజకీయ కోణంలో చూడడం బాధాకరమని అక్కల రిష్వంత్ రాయ్ పేర్కొన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు వైఎస్సార్‌సీపీ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తూ అసత్య ప్రచారం సాగిస్తున్నారని విమర్శించారు. "డీఎస్సీ పరీక్షను నిజంగా అభ్యర్థులు రాశారా లేక వైఎస్సార్‌సీపీ నాయకులు రాశారా అన్న సందేహం కలుగుతోంది. డీఎస్సీలో అర్హత సాధించి ఉద్యోగాలు పొందిన అభ్యర్థులంతా ప్రస్తుతం తమ విధుల్లో నిమగ్నమై ఉండగా, పరీక్ష రాయకపోయిన కొందరు వైఎస్సార్‌సీపీ నాయకులే నిరాధార ఆరోపణలు చేస్తూ రాజకీయ లబ్ధి కోసం అనవసర వివాదాలు సృష్టిస్తున్నారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల విజయాన్ని అభినందించాల్సిన చోట, వారి ఆనందాన్ని దెబ్బతీసే విధంగా అసత్య ప్రచారం చేయడం పూర్తిగా బాధ్యతారాహిత్యానికి నిదర్శనం" అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి నియామక ప్రక్రియ పారదర్శకత, నిబంధనలు, అర్హతలకు అనుగుణంగానే కొనసాగుతుందని, నిరుద్యోగ యువతకు న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అక్కల రిష్వంత్ రాయ్ స్పష్టం చేశారు.



# రైతులు ఆందోళన చెందవద్దు.. ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం

**పవన్ కళ్యాణ్ ఆదేశాలతో ఏలేరు ప్రాజెక్టు నుంచి 1,000 క్యూసెక్కుల నీటి విడుదలకు అధికారులు నిర్ణయం**
**ప్రత్యేక సాగునీటి సలహా మండలి సమావేశంలో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్**



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లాలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి ఎకరాకు, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రత్యేక సాగునీటి సలహా మండలి' సమావేశంలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా, కాకినాడ జిల్లాలో ముఖ్యంగా పిఠాపురం నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో సాగునీటి సరఫరాలో తలెత్తిన సమస్యల పరిష్కారం కోసం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు గత కొన్ని రోజులుగా ఇరిగేషన్ అధికారులతో నిరంతరం చర్చించడం జరిగిందన్నారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పవన్ కళ్యాణ్ చొరవతో సాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారంగా ఏలేరు ప్రాజెక్టు నుంచి 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని అధికారులు నిర్ణయించినట్లు ఎంపీ వెల్లడించారు. ఈ నిర్ణయంతో పిఠాపురం నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా చర్యలు చేపడతామని చెప్పారు. భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ నీటి నిర్వహణ చర్యలపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించామని, దీనికి సంబంధించిన నివేదికను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు సమర్పిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది తీవ్ర వర్షపాతం లోటు నమోదైందని, కాకినాడ జిల్లాలో సాగునీటి అవసరాలకు 14 టీఎంసీల నీరు అవసరముండగా ప్రస్తుతం కేవలం 8.2 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని ఎంపీ వివరించారు. అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించేందుకు ప్రతి గ్రామంలో అధికారులు, రైతులు, లస్కర్లతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులందరూ పంటల బీమా చేయించుకునేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గ రైతులకు సాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన సూచనలు ఇస్తున్నారని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

నేర సమీక్షా సమావేశంలో పెండింగ్ కేసులు

# సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశాలు



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈరోజు కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్, ఐపీఎస్ అధ్యక్షతన జిల్లా నేర సమీక్షా సమావేశం నిర్వహించబడింది. సమావేశంలో ప్రాపర్టీ నేరాలు, మహిళలు మరియు చిన్నారులపై జరిగే నేరాలు, పెండింగ్ కేసుల స్థితిగతులను సమగ్రంగా సమీక్షించి, కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నిర్దిష్ట కాలపరిమితిలో చార్జ్ షీట్లు దాఖలు చేయాలని ఎస్పీ ఆదేశించారు. జిల్లాలో మనీ మ్యూల్ బ్యాంకు ఖాతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల్లో మోసపూరితంగా బదిలీ అవుతున్న నగదుకు సంబంధించి మనీ మ్యూల్ ఖాతాలను గుర్తించి, వాటి వినియోగదారులపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, సంబంధిత నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, బ్యాంకులు మరియు సంబంధిత విభాగాలతో సమన్వయం పెంచాలని అధికారులను ఆదేశించారు. మహిళలు మరియు చిన్నారులపై నేరాల విషయంలో ప్రత్యేక దృష్టి సారించి, అలాంటి కేసులను సున్నితంగా తీసుకుని నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు మరియు సమస్యాత్మక ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వారెంట్లు, సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు అమలు పురోగతిని సమీక్షించి, ఈ విషయంలో పనితీరును మెరుగుపరచాలని పేర్కొన్నారు. అదేవిధంగా హిస్టరీ షీటర్లు మరియు అలవాటు పడిన నేరస్థులపై కఠిన నిఘా కొనసాగించాలని, వాహన తనిఖీలు, నైట్ పెట్రోలింగ్ మరియు కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించి అక్రమ కార్యకలాపాలను అరికట్టాలని సూచించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ మరియు దర్యాప్తులో ఎలాంటి అలసత్వం వహించరాదని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ , ఎస్బి డిఎస్పీ కెవివి సత్యనారాయణ, పెద్దాపురం డిఎస్పీ ఏ బి జి తిలక్, జిల్లాలోని సిఐలు, ఎస్సైలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. చివరగా కేసుల పరిష్కారంలో కృషి చేసిన అధికారులకు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేశారు.

# మెగా డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలి - వైసీపీ డిమాండ్




**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా పర్యవేక్షణలో కాకినాడ జిల్లాలో వైయస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలోమెగా డీఎస్సీపై భారీ నిరసన ర్యాలీ మరియు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ర్యాలీ డి కన్వర్షన్ నుండి నుండి ప్రారంభమై బాలా చెరువువరకు భారీ ఎత్తున సాగింది. అనంతరం ధర్నా నిర్వహించి, నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని, డీఎస్సీ నియామకాల్లో పారదర్శకత పాటించాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వైయస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా అధ్యక్షుడు తోట రాంజీ మాట్లాడుతూ మెగా డీఎస్సీ పై జరిగిన అవకతవకలకు నిరుద్యోగ భృతి అమలు చెయ్యని కారణంగా బస్తీ జీవన విద్యా జీవన విడుదల చేయకుండా హరా కొర అమ్మ ఒడి వేసి అభివృద్ధి అభివృద్ధి అంటూ అప్పులు చేసి రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్పుల్లో ముంచేసి పథకాలు ఏమీ అమలు చేయకుండా ఈరోజు తండ్రి కొడుకులు ఇద్దరు కూటమి ప్రభుత్వం పెద్దలతో కలిసి కబుర్లు చెప్తున్నారు. నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంలో ఢిల్లీ కేంద్ర ప్రభుత్వాన్ని మెడలు వంచి కొమ్ములు విరిచి రోజు అలసిపోయిన రెట్టింపు ఉత్సాహంతో నిరసన తెలియజేస్తు కేంద్ర విద్యా శాఖ మంత్రి చేత రాజీనామా చేయించిన ప్రతి యువతకు విద్యార్థులకు విద్యార్థిని తల్లిదండ్రులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాగిరెడ్డి అరుణ్ కుమార్ ( బన్నీ) మాట్లాడుతూ డీఎస్సీ వ్యవహారానికి వస్తే 16 వేల ఉద్యోగాలకి 3 లక్షల ముప్పై ఆరు వేల మంది పోటీ పడితే అందులో మూడు లక్షల ఇరవై వేలమంది మిగిలిపోయారు ఈ 16 వేల ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోట అనే ముసుగులో జీవో తీసుకువచ్చి అర్హత లేని వారికి ఉద్యోగాలు ఇచ్చి అంటే గోల్డ్ మెడలు వచ్చిన వాళ్ళకి ఉద్యోగాలు లేవు వీళ్ళ దగ్గర అదే స్పోర్ట్స్ లో పార్టిసిపేట్ చేసాము అని సర్టిఫికెట్ ఉన్న వాళ్ళకి ఉద్యోగాలు వచ్చాయి ఉద్యోగం 20 లక్షలు 30 లక్షలు అమ్ముకున్నారు వీటన్నిటిమీద తక్షణమే సి.బి.ఐ విచారణ జరిపించి దానికి బాధ్యులైన వారి తోపాటు విద్యాశాఖ మంత్రి లోకేష్ గారు కూడా చిత్తశుద్ధి ఉంటే సిబిఐ ఎంక్వయిరీకి సిద్ధమై ఉండాలని లేదా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోతుని నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు ఎమ్ రాజబాబు.పిఠాపురం నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు దాసం వెంకటేష్.,పెద్దాపురం నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు వీరం రెడ్డి నాని.,ప్రత్తిపాడు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు సకురు గుర్రాజు.రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ ఎం.జి.కె కిషోర్ హేమంత్. తుని ఎండొరబాబు.పిఠాపురంఉలవల భూషణం. పిఠాపురం కరణం భాను. పెద్దాపురం యువజన విభాగం జిల్లా సభ్యులు మరియు మండల సభ్యులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

**శాసనసభ్యులు వనమాడి కొండబాబు**



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** అర్హులైన ప్రతీ కుటుంబానికి కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో భాగంగా మంగళవారం శాసనసభ్యులు వనమాడి కొండబాబు స్థానిక 26వ డివిజన్ నందు పర్యటించి రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను స్థానిక ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండు సంవత్సరాల్లో ప్రజా సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రతి వర్గానికి మేలు జరిగేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, ఇదే ఉత్సాహంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, పంతాడి రాజు, ఎం.డి ఆన్సర్, సంఘాని నాగూర్, ఎండీ ఖాన్, సంఘాని గంగాధర్, కొనాడ ప్రకాష్, పాలెపు రాజు, కొల్లు ప్రకాష్, సంఘాని పెద్ద నూకరాజు, ఓలేటి ఆదినారాయణ, మేడ విజయ, మహమ్మద్ జహుర్, పూజారి రమ్య, సాహుల్ సయ్యద్, ఫైసల్, తదితరులు పాల్గొన్నారు.

# సాగులో ఉన్న వరి పంటను ఒక ఎకరం తడి ఆరనివ్వం

**ఒక ఎకరం నీట ములగనివ్వం : కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ**



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎల్లినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో ఏలేరు జలాశయంలోని నీటిని అత్యంత ప్రణాళికాబద్ధంగా వినియోగించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చర్యలు చేపట్టారని, ఈ సందర్భంగా వారికీ ప్రత్యేక ధన్యవాదములు తెలియచేస్తున్నామని కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ తెలిపారు. కాకినాడలో నిర్వహించిన ప్రత్యేక ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. తనకు కూడా ఏలేరు ఆయకట్టు పరిధిలోని నేమం, పండూరు, తమ్మవరం, పెనుమర్తి గ్రామాల పరిధిలో సుమారు 2,000 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని తెలిపారు. రైతులు ఎదుర్కొనే ఇబ్బందులు తనకు ప్రత్యక్షంగా తెలుసని, అందువల్ల నీటి నిర్వహణలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రభుత్వ హయాంలో రైతులు వరుసగా పంటలు సాగు చేసుకునే అవకాశం లభించిందని, ప్రస్తుతం ఐదో పంట సాగుకు కూడా అవసరమైన నీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఏలేరు ఆయకట్టు రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రజాప్రతినిధులు, సాగునీటి శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు. నీటి విడుదల విషయంలో ఎంపీ సానా సతీష్ బాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, రైతుల అవసరాలు, ఆయకట్టు పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. రైతులందరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో ఏమ్మెల్సీ పి . హరిప్రసాద్ , ఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్ డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు , కూటమి నాయకులు పెండెం దొరబాబు తదితరులు పాల్గొన్నారు

# ఇద్దరు బ్యాగ్ లిఫ్టర్లు అరెస్ట్ - రూ. 20 లక్షలు విలువచేసే 174 గ్రాముల ఆభరణాలు రికవరీ



**పెద్దాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల బ్యాగులను దొంగలించి వాటిలోని విలువైన బంగారు ఆభరణాలను చోరీ చేస్తున్న ఇద్దరు నిందితులను మంగళవారం పోలీసుల అరెస్టు చేసి వారి నుంచి రూ. 20 లక్షలు విలువ చేసే ఆభరణాలను రికవరీ చేశారు. ఈ మేరకు పెద్దాపురం డిఎస్పీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిఎస్పి ఏబిజి తిలక్ చోరీ వివరాలను వెల్లడించారు. డి.ఎస్.పి మాట్లాడుతూ బాధితులు పి లక్ష్మి తన బంధువుల అమ్మాయి పెళ్లి నిమిత్తం ఏప్రిల్ 30న గోకవరం వెళ్లేందుకు సర్పవరంలో బయలుదేరి సామర్లకోట వచ్చి అక్కడి నుండి రాత్రి సుమారు 7 గంటల సమయంలో గోకవరం వెళ్ళే బస్సు ఎక్కగా పెద్దాపురం వచ్చే సరికి చుసుకోగా పిర్యాది హ్యాండ్ బ్యాగులో నుండి బంగారు నల్లపూసల దండ, నెక్లెస్ రెండు కలిపి సుమారు 64 గ్రాములు దొంగిలించినట్లు గుర్తించారు. దానితో వారు పెద్దాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు అయినట్టు చెప్పారు. అలాగే మరో బాధితురాలు ఎం రేఖ అనే ప్రయాణికురాలు ఏప్రిల్ 1 న తెల్లవారుఝామున సుమారు 4.30 గంటల సమయంలో విశాఖపట్నంలో కాకినాడ వెళ్ళే బస్సు ఎక్కి కాకినాడ వచ్చి చూసుకోగా బస్సులో తన బ్యాగ్లో పెట్టుకున్న బంగారు గాజులు -2, బ్రాస్ లైట్-1, బంగారు గొలుసు -1, నల్లపూసల దండ-1, చిన్న నల్ల పూసల దండ -1, బంగారు ఉంగరం-1, చెవిలీలు ఒక జత చోరీ కాబడినట్టు గుర్తించారన్నారు. వాటి మొత్తం బరువు సుమారు 112 గ్రాములు ఉన్నాయన్నారు. ఈ మేరకు కాకినాడ 2వ పట్టణ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లో దానిపై కేసు నమోదు అయినట్టు వివరించారు. ఈ కేసుల్లో ఎటువంటి క్లూ లేనప్పటికీ, కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా అదనపు ఎస్పీ డా.మహంతి కిషోర్ కుమార్ పర్యవేక్షణలో పెద్దాపురం డిఎస్పీ ఎబిజీ తిలక్ ఆద్వర్యంలో, పెద్దాపురం సీఐ వైఆర్కె శ్రీనివాస్, పెద్దాపురం క్రైమ్ సీఐ ఆర్ అంకబాబు , పెద్దాపురం పోలీస్ స్టేషన్ ఎస్సై యు పాపారావు, క్రైమ్ సిబ్బంది బాలాజీ, రమణ, బాలబాలాజి లు ప్రత్యేక బృందాలుగా కృషి చేసి ఈ కేసులో ముద్దాయిలైన నంద్యాల జిల్లా, ఆత్మకూరు మండలం, సిద్దాపురం గ్రామానికి చెందిన గుంజ గిద్దన్న (41), తమ్మిశెట్టి వాణి (26) లను మంగళవారం పెద్దాపురం పాండవుల మెట్ట సెంటర్ వద్ద అరెస్ట్ చేసి చోరీ సొత్తుని స్వాధీనం చేసుకున్నట్టు డిఎస్పీ వివరించారు. వీరు సామర్లకోట కు రైలులో వచ్చి తరువాత చుట్టుప్రక్కల రద్దీగా ఉన్న బస్ లలో బ్యాగ్ దొంగతనాలకు పాల్పడుతుంటారని, ప్రయాణీకులు బస్ లలో, ఆటోలలో ప్రయాణాలు చేసేటప్పుడు విలువైన బంగారు వస్తువులు బ్యాగ్ లలో, క్యరల బ్యాగ్ లలో ఉంచుకోవద్దు అని డిఎస్పీ తెలిపారు.

# చించినాడ వంతెన పునఃప్రారంభానికి ముందస్తు సన్నాహాలు

**ఎన్‌హెచ్-216పై పోలీస్, రవాణా, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారుల అధికారుల సంయుక్త భద్రతా సర్వే**
**ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు**
**స్కూల్ జోన్లలో స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు, సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** చించినాడ వంతెన పునఃప్రారంభం నేపథ్యంలో ఎన్‌హెచ్-216 జాతీయ రహదారిపై ట్రాఫిక్ రద్దీ గణనీయంగా పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రహదారి భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి పోలీసు, రవాణా, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారుల శాఖల అధికారులు మంగళవారం ఉదయం సంయుక్తంగా విస్తృత స్థాయి రహదారి భద్రతా సర్వే నిర్వహించారు. ప్రమాదాల నివారణతో పాటు ప్రయాణికులకు సురక్షితమైన రాకపోకలు కల్పించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి పలు కీలక సూచనలు చేశారు. సర్వేలో భాగంగా పాశర్లపూడి, పాశర్లపూడి బైపాస్, గెద్దాడ, కడలి, ములికిపల్లి జంక్షన్, గెద్దాడ బైపాస్ రహదారి, చించినాడ--మలికిపురం జంక్షన్ ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు, రాత్రి వేళల్లో స్పష్టమైన దర్శనమిచ్చే లైటింగ్ వ్యవస్థ, క్రాస్ రోడ్ల వద్ద డబుల్ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని గుర్తించారు. వాహనాల వేగాన్ని నియంత్రించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు అభిప్రాయపడ్డారు. గెద్దాడలోని ఎడ్యుకేర్ స్కూల్, ములికిపల్లిలోని నలంద స్కూల్ పరిసరాల్లో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ రెండు విద్యాసంస్థల సమీపంలో స్పీడ్ బ్రేకర్లు, స్కూల్ జోన్ హెచ్చరిక బోర్డులు, సోలార్ వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలు పూర్తి సహకారం అందించాలని అధికారుల బృందం కోరింది. అదేవిధంగా మామిడికుదురు రహదారిపై ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తున్న అక్రమ ఆక్రమణలను సర్వే సందర్భంగా తొలగించారు. రహదారి విస్తరణ, భద్రతా ప్రమాణాల అమలుకు ఇలాంటి ఆక్రమణలు అడ్డంకిగా మారుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. గెద్దాడ-ములికిపల్లి రహదారి మార్గంలో రహదారికి అత్యంత సమీపంలో ఉన్న ఐదు విద్యుత్ స్తంభాలను అత్యవసరంగా తరలించాల్సిన అవసరం ఉందని సర్వేలో గుర్తించారు. వీటి కారణంగా ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నందున సంబంధిత శాఖల సమన్వయంతో వెంటనే చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. సర్వేలో గుర్తించిన అన్ని అంశాలను ఈ నెల నిర్వహించనున్న జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో సమగ్రంగా చర్చించి, జిల్లా కలెక్టర్‌తో పాటు కమిటీ చైర్మన్ ఆమోదం పొందిన అనంతరం అవసరమైన చర్యలను వేగవంతంగా అమలు చేస్తామని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. రహదారి భద్రత అనేది ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలందరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ సంయుక్త రహదారి భద్రతా సర్వేలో జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్, జాతీయ రహదారుల అధికారి వెంకటరమణ, నగరం ఎస్ఐ పద్మారావు, రాజోలు ఎస్ఐ రామకృష్ణారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. అధికారులు సమన్వయంతో చేపట్టిన ఈ సర్వే చించినాడ వంతెన పునఃప్రారంభం అనంతరం ఎన్‌హెచ్-216పై ప్రయాణికుల భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా కీలక అడుగుగా భావిస్తున్నారు.

నీటి ఎద్దడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు, సాగునీటి సంఘాలు

# సమన్వయంతో పనిచేయాలి

**జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** నీటి ఎద్దడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు, సాగునీటి సంఘాలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ మందిరంలో ఇరిగేషన్ అధికారులు, రైతు నీటి సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులతో ఖరీఫ్ పంటకు సంబంధించి సాగునీటి యాజమాన్యం, పంట కాలువల నిర్వహణ, నీటి విడుదల ప్రణాళికలపై ప్రత్యేక సాగునీటి సలహా మండలి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్-నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఖరీఫ్ పంటకు చివరి ఆయకట్టువరకు సాగునీరు అందేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. లోటు వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాబోయే రోజుల్లో లోతట్టు ప్రాంతాలకు కూడా సాగునీరు చేరేలా ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్న ప్రాంతాల నుంచి అవసరమైన ప్రాంతాలకు నీటిని మళ్లించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాతావరణంలో ఏర్పడే ఎల్-నినో ప్రభావం మరియు ఇతర సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. ఖరీఫ్ పంట కాలం అత్యంత కీలకమైనదని పేర్కొన్న జిల్లా కలెక్టర్, ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కాలువల ద్వారా నీటి విడుదలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జలవనరుల ప్రాజెక్ట్ చైర్మన్ బొబ్బల శ్రీనివాస్, శాసనమండలి సభ్యులు కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయిల్, పి.గన్నవరం శాసనసభ్యుడు గిడ్డి సత్యనారాయణ, ఇరిగేషన్ ఎస్ఈ జి. శ్రీనివాసరావు, ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల నాయకులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆషాఢ మాసం సందర్భంగా జనుపల్లి అమ్మవారికి

# సారె చీర, కావిడి, నైవేద్యాల సమర్పణ

**కూరగాయలతో ప్రత్యేక అలంకరణ ఆకట్టుకున్న అమ్మవారి దివ్యరూపం - భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రత్యేక పూజలు**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆషాఢ మాసం సందర్భంగా జనుపల్లి గ్రామంలో వెలసిన గ్రామదేవత జనుపలెమ్మ అమ్మవారికి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో సారె చీర, కావిడి, నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో నిర్వహించే ఈ సంప్రదాయ వేడుకను ఈ ఏడాది కూడా అత్యంత వైభవంగా నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో సుందరంగా అలంకరించడం ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వ్యవసాయ సంపదకు ప్రతీకగా రూపొందించిన ఈ అలంకరణను చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే గ్రామంలోని మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో అమ్మవారి ఆలయానికి చేరుకుని పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, పండ్లు, పూలు, సారె చీరలు, వివిధ రకాల నైవేద్యాలను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. గ్రామ యువకులు, పెద్దలు కలిసి కావిడిని ఊరేగింపుగా తీసుకువచ్చి వాద్యబృందాల నడుమ ఆలయానికి చేరవేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తి గీతాలు, మంగళ వాయిద్యాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. రంగురంగుల కూరగాయలతో అలంకరించిన అమ్మవారి దివ్యరూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుని, ఆలయానికి వచ్చిన ప్రతి ఒక్కరూ భక్తిపారవశ్యంలో దర్శించుకున్నారు. అమ్మవారికి వేద మంత్రోచ్చారణల నడుమ అభిషేకాలు, అర్చనలు, కుంకుమ పూజలు, అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. అనంతరం సారె చీరను సమర్పించి గ్రామ ప్రజలందరి తరఫున ఆయురారోగ్యాలు, సుభిక్షం, సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని, గ్రామంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆషాఢ మాసంలో అమ్మవారికి సారె చీర సమర్పించడం అనేది గ్రామీణ ప్రాంతాల్లో తరతరాలుగా వస్తున్న ఆచారమని పెద్దలు తెలిపారు. ఈ సంప్రదాయం గ్రామ సంస్కృతి, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. అమ్మవారి కృపతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ కుటుంబ సమేతంగా భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మహిళలు అమ్మవారికి మంగళహారతులు ఇచ్చి భక్తి గీతాలు ఆలపించగా, గ్రామ యువత సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధులు కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, ఆషాఢ మాసంలో అమ్మవారిని దర్శించుకుని సారె చీర, నైవేద్యాలు సమర్పిస్తే కుటుంబాలకు శుభం కలుగుతుందనే విశ్వాసం తమలో బలంగా ఉందని తెలిపారు. ప్రతి ఏడాది ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ గ్రామ ప్రజలంతా ఒక్కటిగా పాల్గొనడం ఆనందదాయకమని పేర్కొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ తగిన ఏర్పాట్లు చేయగా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగాయి. చివరగా భక్తులకు తీర్థప్రసాదాలు, ప్రసాదాలను పంపిణీ చేయడంతో పాటు కూల్‌డ్రింక్స్ అందజేశారు. ఆధ్యాత్మికత, సంప్రదాయం, గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఈ ఆషాఢ మాస ఉత్సవం జనుపల్లి గ్రామంలో భక్తిపారవశ్య వాతావరణంలో ఘనంగా ముగిసింది. కూరగాయలతో చేసిన అమ్మవారి విశిష్ట అలంకరణ ఉత్సవానికి మరింత శోభను చేకూర్చగా, భక్తులు అమ్మవారి ఆశీస్సులు పొంది సుఖశాంతులతో జీవించాలని ప్రార్థిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఇంటింటికీ సంక్షేమం... అభివృద్ధి

## 11వ డివిజన్‌లో డోర్ టు డోర్ ప్రచారంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు సమగ్ర అభివృద్ధిని వేగవంతం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని రాజ మహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'ఇంటింటికీ టీడీపీ - ఇంటింటికీ సంక్షేమం' కార్యక్ర మంలో భాగంగా మంగళవారం ఉదయం నగరంలోని 11వ డివిజన్‌లో డివిజన్ ఇన్‌చార్జ్ కంటిపూడి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలపై వివరాలు తెలియ జేస్తూ ప్రత్యేక కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత అధికారులతో వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందన్నారు. 'సూపర్ సిక్స్' హామీల అమలుతో రాష్ట్ర ప్రజల్లో విశ్వాసం పెరిగిందని చెప్పారు. సామాజిక భద్రతా పింఛన్లను రూ.4 వేల నుంచి వివిధ కేటగిరీల వారికి రూ.6 వేల, రూ.10 వేల, రూ.15 వేల వరకు పెంచడం ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పించామన్నారు. అలాగే 'తల్లికి వందనం' పథకం కింద ఇంట్లో చదువుతున్న ప్రతి విద్యార్థి కోసం తల్లికి రూ.15 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, 'దీపం-2' పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అంది స్తున్నామని తెలిపారు. 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆటో డ్రైవర్లకు ఏటా ఆర్థిక సాయం, 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు రూ.20 వేల వరకు పెట్టుబడి సాయం అందిస్తున్నామని వివరించారు. అదేవిధంగా పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను పునరుద్ధరించి విస్తరిస్తున్నామని, రైతుల హక్కులను కాపాడే ఉద్దేశంతో వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి, రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనన్నారు. రాజమహేంద్ర వరం నగర అభివృద్ధికి కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పార్కులు, క్రీడా మౌలిక వసతులు, విద్యా మరియు వైద్య రంగాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో విధ్వంసం, అప్పులు, అభివృద్ధి నిర్లక్ష్యం మాత్రమే కనిపించాయని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శక పాలన అందిస్తోందన్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం చేసిన మేలు తెలియజేయడమే 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

**ప్రముఖ విద్యావేత్త నున్న సురేష్ మృతి పట్ల సంతాపం**

తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావు సోదరుడు, తిరుమల విద్యాసంస్థల భాగస్వామి, ప్రముఖ విద్యావేత్త నున్న సురేష్ ఆకస్మిక మృతి పట్ల ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. తిలక్ రోడ్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద నున్న సురేష్‌కి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల మౌనం పాటించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ కంటిపూడి రాజేంద్రప్రసాద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

### మంత్రి నారా లోకేష్

# వెంటనే రాజీనామా చేయాలి

- మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ డిమాండ్
- వైసిపి ర్యాలీని అడ్డుకున్న పోలీసులు.. తీవ్ర ఉద్రిక్తత
- కూటమి ప్రభుత్వ పాలనలో అన్ని వైఫల్యాలే..
- అక్రమ కేసులను చట్టపరంగా ఎదుర్కొంటాం
- నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయాలి
- ఫీజు రీఎంబర్స్మెంట్ బకాయిలు చెల్లించే వరకు వైసిపి ఉద్యమం ఆగదు..





**రాజమహేంద్రవరం, విష్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో జరిగిన డిఎస్సీ నియామకాల విషయంలో భారీ ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని, వీటికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, రాజమండ్రి మాజీ ఎంపీ, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్ డిమాండ్ చేసారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు మార్గాని భరత్ రామ్ ఆధ్వర్యంలో డిఎస్సీ అక్రమాలపై, నీట్ పరీక్షలో జరిగిన తప్పుల భాధ్యుల పైన, నిరుద్యోగ భృతి తక్షణమే అమలు, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ పార్టీ యువజన, విద్యార్థి విభాగాలు నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక వివిఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ వద్దకు భారీ ఎత్తున చేరుకున్న యువత, వైసిపి నాయకులు, కార్యకర్తలను పోలీసులు ర్యాలీ నిర్వహించకుండా అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గేమ్ ఓవర్ పేరుతో చంద్రబాబు, లోకేష్ చిత్ర పటాలతో ప్రదర్శించిన ఫ్లెక్సీ పోలీసులు లాక్కునేందుకు ప్రయత్నించడంతో నాయకులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. పోలీసుల తీరుపై వైసిపి నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. శాంతి యుతంగా ర్యాలీ నిర్వహిస్తుంటే అడ్డుకోవడానికి ప్రయత్నించడం దారుణమని మండిపడ్డారు. మార్గాని భరత్ ఆధ్వర్యంలో అక్కడ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా తాడితోట వరకు చేరుకుని కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ రోడ్డుపై నిరసన చేపట్టారు. పోలీసులు భారీ ఎత్తున మోహరించడంతో గందరగోళం చేలరేగింది. ఈ సందర్భంగా భరత్ రామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో డిఎస్సీలో స్పోర్ట్స్ కోటా ఉద్యోగాలను 15 లక్షల చొప్పున అమ్ముకుని నిరుద్యోగులను మోసం చేసారని ఆరోపించారు. ఢిల్లీలో నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టిన కాక్రోచ్ జనతా పార్టీ తరహాలోనే తాము కూడా ఇక్కడ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ రాజీనామా చేసే వరకు ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం పని అయిపోయిందని, ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసారని విమర్శించారు. డిఎస్సీ పరీక్ష, నియామకాల్లో జరిగిన అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించి వాస్తవాలు నిగ్గు తేల్చేవరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేసారు. ఫీజ్ రీ ఎంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించడంతో పాటు నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలు సంసిద్ధులయ్యారని పేర్కొన్నారు. పోలీసులు వైసిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టి వేధించాలని ప్రయత్నిస్తున్నారని దాన్ని న్యాయ స్థానాల ద్వారా తిప్పికొట్టడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం నగర అధ్యక్షుడు బిల్డర్ చిన్నా, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరె చిన్ని, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుర్రం గౌతమ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మీ, సంకిస భవానీ ప్రియ, నగర మహిళా అధ్యక్షురాలు పోలు విజయలక్ష్మి, దాసి వెంకట్రావు, రొక్కం త్రినాధ్, నల్లా రామాంజనేయులు, మజ్జి అప్పారావు, కాటం రజనీకాంత్, బూడిద శరత్‌కుమార్, ముప్పన శ్రీను, మార్తి నాగేశ్వరరావు, మార్గాని రాము, నందం స్వామి, అందనాపల్లి సత్యనారాయణ, సుభాని, దూర్వాసుల సత్యనారాయణ, సుందర్ సింగ్, గుడాల ఆదిలక్ష్మి, గుడాల ప్రసాద్, గుత్తుల భాస్కర్, సేపేని మునీశ్వరరావు, అనంతలక్ష్మి, వట్టికూటి కృష్ణవేణి, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

# కోరుకొండ డంపింగ్ యార్డును మార్చండి మహాప్రభు

## గ్రామస్తులు ఆవేదన - పిల్లలు వృద్ధుల్లో శ్వాసకోస వ్యాధులపై ఆందోళన





**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ డంపింగ్ యార్డును ప్రస్తుతం ఉన్న ప్రదేశం నుండి పాత ప్రదేశానికి మార్చాలని పశ్చిమ గోనగూడెం గ్రామస్తులు కోరుకొండ పంచాయతీ సిబ్బంది వద్ద తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సెక్రెటరీ నాగరత్నం, సిబ్బంది కోరుకొండ డంపింగ్ యార్డును సందర్శించి, గ్రామస్తుల ఆవేదనను ఆలకించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కోరుకొండ మేజర్ పంచాయతీ నుండి అనునిత్యం తెస్తున్న చెత్త నుండి వెలువడుతున్న తీవ్ర దుర్గంధంతో, భరించలేని దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నామన్నారు. దీనికి తోడు చెత్తను తగలబెట్టడంతో దుర్గంధంతో పొగ వ్యాపించి, కళ్ళు మంటలు, ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉండడం, శ్వాసకోస వ్యాధులు వ్యాపించే పరిస్థితి ఉండడంతో పిల్లలు, వృద్దులు పట్ల మరింత భయాందోళన చెందుతుందని ఆవేదన చెందారు. ఈ సందర్భంగా సెక్రెటరీ నాగరత్నం మాట్లాడుతూ ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించడానికి శక్తివంతం లేకుండా కృషి చేస్తానని గ్రామస్తులకు హామీ ఇస్తూ, ఈ సమస్య పరిష్కారానికి గ్రామస్తులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రొంగల దేవిక శ్రీనివాస్, సెక్రెటరీ నాగరత్నం, గరగ శ్రీధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### మత్తుకు బానిసై బంగారు జీవితం

# నాశనం చేసుకోవద్దు : ఏఎస్ఐ రామకృష్ణ

## విద్యార్థినులు "శక్తి యాప్" డౌన్లోడ్ చేసుకోండి



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థులు సరదాల కోసం మత్తుకు బానిసై బంగారు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని శక్తి టీం ఏఎస్ఐ రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని గుమ్ములూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గంగాభవాని ఆధ్వర్యంలో శక్తి టీం సైబర్ నేరాలు, మహిళలు కిషోర్ బాలికల సంరక్షణ, డ్రైవింగ్ వంటి పలు అంశాలపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ లైంగిక వేధింపులు చేస్తున్నట్లయితే1098, ఉచితలకు అలవాటు పడి సైబర్ నేరాల పట్ల మోసపోకుండా అవగాహన పెంచుకోవాలన్నారు. చైల్డ్ హెల్ప్ లైన్, సైబర్ నేరాలకు గురైనప్పుడు1930, గంజాయి, మత్తుకు బానిస అయిన పరిస్థితుల్లో1972 నెంబర్లకు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళలు, కిషోర్ బాలికలకు ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు "శక్తి యాప్" ద్వారా పోలీసులకు సమాచారం ఇస్తే, తక్షణమే వచ్చి ఆపదనుండి రక్షిస్తారన్నారు. ప్రతి ఒక్కరు శక్తి యాప్ తప్పనిసరిగా డౌన్లోడ్ చేసుకోవాల న్నారు. అదే విధంగా మైనర్లు డ్రైవింగ్ చేయరాదని, త్రిబుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు వాహన రికార్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం సిబ్బంది శ్రీనివాసరావు,మణి,శారద, ఉపాధ్యాయ సిబ్బంది సుభాష్ చంద్రబోస్, రామకృష్ణ, జాకబ్ రాజు, నాగేశ్వరరావు ప్రియదర్శిని, కుమారి, త్రిలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వాహనాలు రోడ్డు మార్జిన్ దాటితే కఠిన చర్యలు



**కమీషనర్ టీవీ రంగారావు**

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్యలకు అడ్డుకట్ట వేసేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. రోడ్డు మార్జిన్ బయట వాహనాలు నిలిపే వ్యాపారస్తులు, వాహన విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమీషనర్ టి వి రంగారావు హెచ్చరించారు.మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన, షాపుల ముందు వాహనాలను రోడ్డు మార్జిన్ లోపలే నిలపాలని సూచించారు. వాహన విక్రయదారులు తమ వాహనాలను డ్రైన్ లోపలి భాగంలోనే ప్రదర్శించాలని ఆదేశించారు.రోడ్డుపై అడ్డంగా వాహనాలు నిలపడం వల్ల ట్రాఫిక్‌కు, పాదచారులకు ఇబ్బంది కలుగుతోందని, ఇకపై అలాంటి వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండబోదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కె. రమ్య, మున్సిపల్ మేనేజర్ వి. శ్రీనివాసరావు, స్వర్ణ వార్డు మేనేజర్ దంటు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరంగపట్నంలో బోనాలతో కదంతొక్కిన మహిళలు

## వైభవంగా ప్రారంభమైన మాతృశ్రీ మోదకొండమ్మ జాతర






**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం శ్రీరంగపట్నం ఆడపడుచు మాతృశ్రీ మోదకొండమ్మ జాతర మహోత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం మాతృశ్రీ మోదకొండమ్మ జాతర మహోత్సవాలను పురస్కరించుకొని గ్రామంలో మహిళలందరూ పెద్ద ఎత్తిన బోనాలు ఎత్తుకొని, వైభవంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. మంగళవారం నుండి ఆగస్టు నాలుగో తేదీ వరకు జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతాయని, ఈ సందర్భంగా ప్రతిరోజు సాయంత్రం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీసభ్యులు తెలిపారు. ఈ జాతరలో ఇటువంటి అసలీల నృత్యాలు, ప్రదర్శనలు నిర్వహించరాదని పోలీసులు ఆలయ కమిటీసభ్యులకు, గ్రామస్థులకు ముందస్తుగా అవగాహన కల్పించారు. ఆగస్టు నాలుగో తేదీ ముగింపు సందర్భంగా ప్రఖ్యాతిగాంచిన 80ఆధ్యాత్మిక కార్యక్రమాలు అందరి సహాయ సహకారాలతో ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామని ఆలయ కమిటీసభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ ఎస్సై వెంకట రమేష్, ఆలయ కమిటీ సభ్యులు అధ్యక్షులు ఆళ్ళ కృష్ణ, ఉపాధ్యక్షులు బొడ్డేటి అబ్బులు, సెక్రెటరీ పెంటకోట బ్రహ్మం, మాజీ సర్పంచ్ మద్దాల పెద్దమ్మాజీ రమణ, సూరిశెట్టి భాస్కరరావు, అతికంశెట్టి కామరాజు, సూరిశెట్టి సత్యనారాయణ, మద్దాల కృష్ణ, తనకాల నాయుడు, అతికంశెట్టి శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ట్రోలర్స్, హేటర్స్, ఫ్యాన్స్‌కీ

# అల్లు అర్జున్ ఇచ్చిన స్టేట్మెంట్ ఇదే!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా ఇప్పుడు నటిస్తున్న అవైటెడ్ చిత్రమే "రాకా". దర్శకుడు అట్లీతో చేస్తున్న ఈ మాసివ్ ప్రాజెక్ట్ షూట్ కి చిన్న గ్యాప్ ఇచ్చి బన్నీ లేటెస్ట్ గా తన ఫ్యాన్స్ తో ఇంటరాక్ట్ అవ్వడం జరిగింది. దాదాపు 2000 మంది తన అభిమానులతో మీటప్ అయ్యిన బన్నీ ఇందులో చాలానే విషయాలు షేర్ చేసుకున్నారు. ఇలా మంచి సందర్భం వచ్చింది కాబట్టి తన అభిమానులకి అనే కాదు ట్రోల్స్ చేసే వారికీ, హేట్ చేసేవారికి కూడా ఒకటే స్టేట్మెంట్ ని అందించడం వైరల్ గా మారింది. మీకు ఒకటి నచ్చలేదు అంటే అసలు ఆ విషయాన్ని పట్టించుకోవడం మానెయ్యండి అని మీకు నచ్చని విషయంపై ఎందుకు మీ టైం వేస్ట్ చేసుకుంటున్నారని ఐకాన్ స్టార్ హితవు పలికారు. అంతే కాకుండా దీనికి మంచి ఉదాహరణ కూడా అందించడం జరిగింది. నీ దగ్గర 100 రూపాయలు ఉంటే అవి నీకు నచ్చని వాటి మీద ఖర్చు పెట్టవు కదా ఇది కూడా అలానే నీకో విషయం నచ్చనపుడు సమయం వృధా చేసుకోకుండా నీకు నచ్చిన మరో పని చేసుకోమని చెప్పడం ఈ మీట్ లోనే ఒక హైలైట్ స్టేట్మెంట్ గా నిలిచి సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# 'లెనిన్' బ్యూటీకి అవమానాలు..

## వాట్సాప్‌లో బ్లాక్ వరకూ



వెండితెరపై ఒక నటుడో లేదా నటి రాణించాలి అంటే అది అంత సులువు కాదు. తాము తెరపై కనిపించి నిలదొక్కుకోవాలి అంటే ఆ ప్రయాణం ఎవరికీ అంత సజావుగా సాగదు. అలానే లేటెస్ట్ టాలీవుడ్ సెన్సేషన్ భాగ్యశ్రీ బోర్సే కూడా తన జర్నీ విషయంలో చేసిన కామెంట్స్ ఇపుడు వైరల్ గా మారాయి. చాలామందికి ఇంట్లో సినిమాల్లోకి వెళతాను అని చెబితే వద్దనే సమాధానం ఎలా వినిపిస్తుందో అదే సమాధానం భాగ్యశ్రీకి కూడా ఎదురైందట. ఇలా సినిమాల్లోకి వెళతాను అంటే తన జర్నీలో ఎవరూ తన కుటుంబం నుంచి చిన్న ప్రోత్సాహం కూడా అందించలేదని ఆమె రీసెంట్ ఓ ఇంటరాక్షన్ లో చెప్పుకొచ్చింది. అంతేకాకుండా తన నిర్ణయాన్ని విని వాట్సాప్ లో కూడా బ్లాక్ చేసారని ఆమె ఇంకో షాకింగ్ విషయాన్ని కూడా ఆమె లైఫ్ నుంచి షేర్ చేసుకుంది. ఇలా ఆమెకి కూడా కొన్ని అవమానాలు ఎదురుకాక తప్పలేదు. అయితే తాను ఏం చేసిన తన కుటుంబం ఆర్థికంగా నిలబడాలి అనే చేసానని ఇటీవల అఖిల్ 'లెనిన్' ప్రయాణంలో చెప్పుకొచ్చింది. ఇప్పుడు ఆమె కోరుకున్న సక్సెస్ కూడా అందుకొని ఆ వైబ్ ని ఎంజాయ్ చేస్తుంది.

# బ్రహ్మ ముహూర్తంలో ఎపిక్ 'రామాయణ' ట్రైలర్ ఫిక్స్.. ఎప్పుడంటే..?

బాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ బిగ్ బడ్జెట్ మూవీ 'రామాయణ' ట్రైలర్ ఇప్పటికే రిలీజ్ కావాల్సి ఉన్నా, కొన్ని కారణాల వల్ల అది వాయిదా పడింది. ఇక ఎప్పుడెప్పుడు ఈ ట్రైలర్ వస్తుందా అని ఎదురుచూస్తున్న ప్రేక్షకులు మేకర్స్ గుడ్ న్యూస్ చెప్పారు. ఈ చిత్ర ట్రైలర్ విడుదలకు మేకర్స్ ముహూర్తం ఖరారు చేశారు. ఈ ప్రెస్టీజియస్ ట్రైలర్‌ను జూలై 30 తెల్లవారుజామున 4:15 గంటలకు రిలీజ్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. ఎంతో పవిత్రమైన బ్రహ్మ ముహూర్తంలో ఈ ట్రైలర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నట్లు మేకర్స్ ఓ పోస్టర్ ద్వారా వెల్లడించారు. ఈ దివ్యమైన సమయాన్ని ఎంచుకోవడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. రణ్‌బీర్ కపూర్ రాముడిగా సాయి పల్లవి సీతగా, యష్ రావణుడిగా నటిస్తున్న ఈ ప్రెస్టీజియస్ చిత్రం కోసం సినీ ప్రియులు, అభిమానులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. జూలై 30న రాబోతున్న ఈ ట్రైలర్ ఎలాంటి విజువల్ వండర్‌ను ఆవిష్కరిస్తుందో చూడాలి.







# ఛీ.. వికెట్ కోసం ఇంతకు దిగజారాలా..

## అంపైర్‌నే బురిడీ కొట్టించిన ఫీల్డర్.. వీడియో చూస్తే తిడతారంతే..!

నిజాయితీకి మారుపేరుగా నిలిచే ఆటలో ఇలాంటి చిల్లర వేషాలు క్రికెట్ ప్రతిష్టనే మసకబారుస్తున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. క్రీడా స్ఫూర్తిని మంటగలిపిన సాల్ట్‌బర్న్ జట్టుపై స్థానిక క్రికెట్ బోర్డు అధికారులు ఎలాంటి కఠిన శిక్షలు విధిస్తారో వేచి చూడాలి. క్రికెట్‌లో రకరకాల మోసాలు మనం చూస్తూనే ఉంటాం. కానీ ఇంగ్లండ్ గడ్డపై జరిగిన ఓ వింత ఘటన ఇప్పుడు క్రీడా లోకాన్ని నివ్వెరపరుస్తోంది. బంతి బ్యాట్‌కు ఏమాత్రం తగలకపోయినా స్లిప్‌లో ఉన్న ఓ ఫీల్డర్ చిటికె వేసి, ఆ శబ్దంతో అంపైర్‌ను బోల్తా కొట్టించాడు. అన్యాయంగా బ్యాటర్‌ను బలిచేసిన ఈ ఘటన తీవ్ర దుమారం రేపుతోంది.

**క్రికెట్ దేవుడికే కళ్లు బైర్లు కమ్మే చీటింగ్..**

క్రీడా స్ఫూర్తికి మారుపేరుగా నిలిచే జెంటిల్‌మెన్ గేమ్‌లో ఇలాంటి దిగజారుడు తనం బహుశా ఎవరూ ఊహించి ఉండరు. ఇంగ్లండ్ దేశవాళీ క్రికెట్ టోర్నీలో మైదానం సాక్షిగా కళ్లు చెదిరే మోసం వెలుగుచూసింది. సెకండ్ ఎలెవన్ డివిజన్ 2 లీగ్‌లో భాగంగా సాల్ట్‌బర్న్, నార్టన్ జట్ల మధ్య ఓ కీలక పోరు జరిగింది. ఈ మ్యాచ్‌లో సాల్ట్‌బర్న్ జట్టు ఆటగాళ్లు చేసిన ఓ నీచమైన పని ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. వికెట్ తీయడం కోసం బౌలర్ కష్టపడాలి, లేదంటే ఫీల్డర్లు అద్భుతమైన డైవ్ చేసి క్యాచ్ పట్టాలి. ఆ రెండు చేతకాని సాల్ట్‌బర్న్ ఆటగాళ్లు ఏకంగా అంపైర్‌నే గుడ్డివాడిని చేసే కుట్ర పన్నారు. గెలుపు కోసం ఏ అడ్డదారైనా తొక్కొచ్చన్న వారి కుసంస్కారం కెమెరాలకు అడ్డంగా దొరికిపోయింది.

**చిటికె వేసి వికెట్ లేపేశారు..!**

నార్టన్ జట్టు బ్యాటర్ నోమాన్ షబ్బీర్ క్రీజులో ఉన్న సమయంలో ఈ దారుణం చోటుచేసుకుంది. బౌలర్ వేసిన బంతి షబ్బీర్ బ్యాట్‌కు




అతి సమీపం నుంచి వికెట్ కీపర్ చేతుల్లోకి వెళ్ళింది. బంతి బ్యాట్‌కు తగల్లేదు, కనీసం ఆ దరిదాపుల్లో కూడా లేదు. సరిగ్గా అదే సమయంలో స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్న సాల్ట్‌బర్న్ ఆటగాడు తన రెండు వేళ్లతో గట్టిగా చిటికె వేశాడు. ఆ చిటికె నుంచి వచ్చిన శబ్దం అచ్చం బంతి బ్యాట్ ఎడ్జ్ తీసుకున్నప్పుడు వచ్చే సౌండ్‌లాగే వినిపించింది. అంపైర్ కళ్లుగప్పడానికి స్లిప్ ఫీల్డర్ వేసిన ఈ మాస్టర్ ప్లాన్ చూసి నెటిజన్లు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. ఫీల్డర్ సౌండ్ చేయగానే, వెంటనే వికెట్ కీపర్ జోష్ బోవ్స్ క్యాచ్ పట్టుకుని అవుట్ కోసం గట్టిగా అప్పీల్ చేశాడు. చుట్టుపక్కల ఉన్న ఫీల్డర్లు అంతా కలిసి ఒక్కసారిగా అరుస్తూ అంపైర్‌పై ఒత్తిడి తెచ్చారు. ఆ శబ్దాన్ని నిజంగానే బ్యాట్ సౌండ్ అని భ్రమపడిన అంపైర్, వెంటనే వేలు పైకెత్తి నోమాన్ షబ్బీర్‌ను క్యాచ్ అవుట్‌గా ప్రకటించాడు. ఏమాత్రం తప్పు చేయని బ్యాటర్ నిస్సహాయంగా పెవిలియన్ వైపు వెళ్లడం అభిమానులను తీవ్రంగా కలచివేసింది. ఈ పక్కా ప్లాన్డ్ మోసానికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. క్రీడాభిమానులు ఈ వీడియోను షేర్ చేస్తూ సాల్ట్‌బర్న్ జట్టు తీరుపై మండిపడుతున్నారు. ఈ వివాదం కాస్తా ముదరడంతో నార్త్ యార్క్‌షైర్, సౌత్ దర్హామ్ క్రికెట్ లీగ్ యాజమాన్యం రంగంలోకి దిగింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌పై తమకు అధికారికంగా ఫిర్యాదు అందిందని బోర్డు ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ ఘటనపై నిష్పాక్షికంగా పూర్తి స్థాయి విచారణ జరుపుతున్నామని వారు ఒక ప్రకటనలో తెలిపారు. విచారణ పూర్తయ్యే వరకు ఈ వ్యవహారంపై ఎలాంటి అదనపు వ్యాఖ్యలు చేయబోమని తేల్చి చెప్పారు.

**వాళ్లకు మోసాలు చేయడం వెన్నతో పెట్టిన విద్య!**

సాల్ట్‌బర్న్ జట్టు ఇలాంటి చీటింగ్‌లకు పాల్పడటం ఇదే తొలిసారి కాదని ప్రత్యర్థి జట్లు ఆరోపిస్తున్నాయి. మిడిల్స్‌బ్రో సెకండ్ ఎలెవన్ కెప్టెన్ రోరీ కౌటెరిల్ ఈ వివాదంపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. గత నెలలో సాల్ట్‌బర్న్‌తో జరిగిన తమ మ్యాచ్‌లో కూడా సరిగ్గా ఇలాంటి మోసాలే రెండుసార్లు జరిగాయని అతను బాంబు పేల్చాడు. ఆ మ్యాచ్‌లో తమ జట్టు అన్యాయంగా 29 పరుగుల తేడాతో ఓడిపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఒకే తప్పును పదే పదే చేస్తున్న సాల్ట్‌బర్న్ ఆటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇక తాజా వివాదానికి కారణమైన మ్యాచ్‌లో సాల్ట్‌బర్న్ జట్టు ఏకంగా 159 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఇలా మోసాలకు పాల్పడుతూ పాయింట్ల పట్టికలో 17 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

# లక్ష్మణ్ దెబ్బకు గంభీర్ ఔట్..? లంక టూర్‌కు టీమిండియా హెడ్ కోచ్‌గా ఎవరో తెలిసిపోయిందిగా..!

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో నిలవాలంటే శ్రీలంక పర్యటన భారత జట్టుకు అగ్నిపరీక్ష లాంటిది. కోచ్‌గా తనపై వస్తున్న తీవ్ర విమర్శలకు చెక్ పెట్టాలంటే లంక గడ్డపై పక్కా వ్యూహాలతో సిరీస్ క్లీన్ స్వీప్ చేయడం గౌతమ్ గంభీర్‌కు అత్యంత ఆవశ్యకం. శ్రీలంకతో జరగనున్న ప్రతిష్టాత్మక టెస్ట్ సిరీస్‌కు టీమిండియా హెడ్ కోచ్ ఎవరన్న సస్పెన్స్‌కు ఎట్టకేలకు తెరపడింది. జింబాబ్వే టూర్‌లో వీవీఎస్ లక్ష్మణ్ అద్భుత విజయాలు సాధించడంతో గౌతమ్ గంభీర్ స్థానం గల్లంతైందన్న పుకార్లకు బీసీసీఐ పూర్తిగా చెక్ పెట్టింది. కీలకమైన లంక పర్యటనకు పగ్గాలు చేపట్టేది గంభీరేనని, కోచ్ మార్పు వార్తల్లో ఎలాంటి నిజం లేదని కుండబద్దలు కొట్టింది. శ్రీలంక పర్యటన కోసం పదిహేను మంది ఆటగాళ్లతో కూడిన పటిష్టమైన జట్టును క్రికెట్ బోర్డు ప్రకటించినప్పటి నుంచి అభిమానుల్లో ఒకటే ఉత్కంఠ నడుస్తోంది. దీనికి ప్రధాన కారణం ఇటీవల ఆఫ్రికా ఖండంలో ముగిసిన జింబాబ్వే టీ20 సిరీస్. యువ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో బరిలోకి దిగిన భారత యువ జట్టు అద్భుతంగా ఆడి ఆ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసింది. ఆ పర్యటనకు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ పూర్తిస్థాయి విశ్రాంతి తీసుకోగా, నేషనల్ క్రికెట్ అకాడమీ బాధ్యతలు చూసుకునే వీవీఎస్ లక్ష్మణ్ తాత్కాలిక కోచ్‌గా పగ్గాలు చేపట్టాడు. తనదైన ప్రశాంత శైలిలో కుర్రాళ్లను ముందుండి నడిపించి అద్భుతమైన రిజల్ట్ రాబట్టాడు. ఎలాంటి అనుభవం లేని కుర్రాళ్లతో కూడిన జట్టును తీసుకువెళ్లి, విదేశీ గడ్డపై ఆతిథ్య జట్టును వణికించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. దీంతో తీవ్ర ఒత్తిడిలో ఉన్న గంభీర్‌ను వెంటనే ఆ పదవి నుంచి తప్పించి, పూర్తిగా లక్ష్మణ్‌కే టెస్ట్ జట్టు బాధ్యతలు అప్పగించాలని నెటిజన్లు పెద్ద ఎత్తున బీసీసీఐకి విజ్ఞప్తులు చేయడం మొదలుపెట్టారు.

**వదంతులకు చెక్.. లంక గడ్డపై వ్యూహకర్త అతడే..**

నెట్టింట జరుగుతున్న ఈ రచ్చకు తెరదించుతూ రాబోయే కఠినమైన శ్రీలంక టెస్ట్ సిరీస్‌కు గౌతమ్ గంభీరే హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తాడని స్పష్టత వచ్చేసింది. అసలు కుర్రాళ్లతో కూడిన జింబాబ్వే పర్యటనకు గంభీర్ దూరమవ్వడం వెనుక వేరే బలమైన కారణం ఉందన్న విషయాన్ని సీనియర్ విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. రాబోయే ప్రతిష్టాత్మక వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ పోరుకు అర్హత సాధించాలంటే శ్రీలంకపై టెస్ట్ సిరీస్ గెలవడం టీమిండియాకు చాలా కీలకం. అందుకే ఆ సిరీస్ కోసం పక్కాగా వ్యూహాలు రచించుకోవడానికే గంభీర్ ఈ చిన్నపాటి విరామం తీసుకున్నాడు. అంతేకానీ లక్ష్మణ్‌ను కోచ్‌గా శ్రీలంక విమానం ఎక్కించే ఉద్దేశం బీసీసీఐ పెద్దలకు ఏమాత్రం లేదు. రాబోయే 2027 వన్డే వరల్డ్ కప్ వరకు భారత జట్టును నడిపించేందుకు గంభీర్‌తో బోర్డు పక్కా ఒప్పందం చేసుకుంది. ఆలోపు అతడిని పదవి నుంచి తప్పించే సాహసం ఎవరూ చేయరని స్పష్టమైంది.




**గంభీర్‌పై డబ్ల్యూటీసీ ఒత్తిడి.. అసలు పరీక్ష ఇక్కడే..!**

నిజానికి రవిశాస్త్రి, ద్రావిడ్ తర్వాత హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన గౌతమ్ గంభీర్‌కు పరిస్థితులు అస్సలు కలిసిరావడం లేదు. సొంతగడ్డపై టెస్ట్ ఫార్మాట్‌లో ఎవరికీ తలవంచని టీమిండియా ప్రదర్శన ఈ మధ్యకాలంలో దారుణంగా పడిపోయింది. బలహీనంగా కనిపించిన న్యూజిలాండ్ చేతిలో అవమానకర రీతిలో వైట్‌వాష్‌కు గురై తీవ్ర విమర్శల పాలైంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com